


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

శుక్రవారం 24 అక్టోబర్ 2025

వైఎస్ఆర్ కడప

పేజీలు - 08


## 16 మండలాల్లో 2711 హెక్టార్లలో

# పంట నష్టం

**కడప బ్యూరో - మేజర్‌న్యూస్**

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని 16 మండలాల్లో 2711 హెక్టార్లలో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి పంపినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్ర నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్షాలకు లోతట్టు ప్రాంతాలల్లో ఉన్న పంటలు మునకకు గురి అయ్యే అవకాశం ఉన్నది. కోత దశలో ఉన్న వరి, మినుము పంటలకు గింజలు మొలకలు వచ్చి పంట నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ అధిక వర్షాలకు ఇప్పటివరకు 16 మండలలల్లో పంట నష్ట ప్రాథమిక నివేదికలు మండల వ్యవసాయ అధికారుల నుంచి పొందటం జరిగిందని తెలిపారు. ఈ నివేదికల ప్రకారము, వరి పంట 1970 హెక్టార్లు, కంది 258 హెక్టార్లు, మినుము 228 హెక్టార్లు, వేరుశనగ-134 హెక్టార్లు, పత్తి పంట 81 హెక్టార్లు, మొక్కజొన్న-40 హెక్టార్లు మొత్తంగా 2711 హెక్టార్లల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమిక నివేదికలను ఉన్నతాధికారులకు పంపినట్లు ఆయన తెలిపారు.

## క్షేత్ర స్థాయిలో ముందస్తు

# చర్యలు తీసుకోండి!

- అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలి
- టెలికాన్ఫిరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించిన జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్
- జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ : 08562 - 246344 ఏర్పాటు



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల అధికారులను.. జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులపై.. జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ జిల్లా స్థాయి, క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. మండలాల వారీగా చెరువు కట్టలు, ..మిగతా 2పేజీలో





కడపలో లోతట్టు ప్రాంతాల్లో ఆటోలో తిరుగుతున్న ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి

# అప్రమత్తంగా ఉండండి!

- అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు
- జిల్లాకు అత్యవసర నిధులు రూ.కోటి మంజూరు
- జిల్లాలో ఎస్డీఆర్ బృందాలు మోహరించాలని సీఎం సూచన
- మరో 24 గంటలపాటు జిల్లాపై అల్పపీడన ప్రభావం

భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేని వర్షం కురుస్తూనే ఉంది. నల్లని మబ్బులతో మేఘావృతమై జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. రోడ్లు చిత్తడిగా మారాయి. నదులు..కాల్వలు..వంకలు ప్రవహిస్తున్నాయి. వర్షాల కారణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాత భవనాల్లోని ప్రజలను మిగతా 2పేజీలో

## భారీవర్షాలపై దుబాయ్ నుంచే సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

**కడప బ్యూరో - మేజర్‌న్యూస్**



బంగాళఖాతంలో నెలకొన్న అల్పపీడన ప్రభావం జిల్లాపై స్పష్టంగా కనిపిస్తోంది. జడివానతో జిల్లా తడిసి ముద్దవుతోంది. మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తూనే ఉంది. నదులు..వాగులు ప్రవహిస్తున్నాయి. రోడ్లు చిత్తడిగా మారాయి. గ్రామాలు అపరిశుభ్రతతో అల్లాడుతున్నాయి. మరో 24 గంటల పాటు వర్షాల ప్రభావం ఉండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆయన నేరుగా దుబాయ్ నుంచి జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అత్యవసర నిధి కింద జిల్లాకు రూ.కోటి మంజూరు చేశారు. జిల్లాలో ఎన్డీఆర్ బృందాలను మోహరించాలని సూచించారు. కాగా, బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 1272.8 మి.మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా చెన్నూరులో 74.6 మి.మీటర్లు నమోదైంది.



## కూటమి ప్రభుత్వం కుట్రలు తిప్పికొట్టే విధంగా

# సంతకాల సేకరణ

- స్వచ్ఛందంగా ప్రజలతో సంతకాల సేకరించండి
- ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి
- వైకాపా శ్రేణులకు ఎంపీ అవినాష్ రెడ్డి పిలుపు

7 పేజీలో



# కుళ్లుతున్న ఉల్లి

- గిట్టుబాటు ధర లేక విలవిల
- వర్షాలతో పంటను పొలంలోనే వదిలేస్తున్న వైనం
- జిల్లా రైతాంగానికి భారీ నష్టం

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** ఉల్లి రైతు కంట కన్నీరు పెట్టిస్తోంది. సోమవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఉల్లి రైతుల కండ్లల్లో రక్త కన్నీరు వస్తోంది. రోజురోజుకూ ఉల్లి ధర పడిపోతుండడంతో రైతులు ..మిగతా 2పేజీలో

## క్షేత్ర స్థాయిలో ముందస్తు చర్యలు తీసుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

కాలువ గత్తుల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు, వంకలు, కుంటల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి ప్రధాన కార్యస్థానాలలో అందు బాటులో ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడా పాడి సంరక్షణకు, పశునష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే.. వెంటనే దానిని పునరుద్ధరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విపత్తు సమయంలో ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది మరింత బాధ్యతతో వారి విధులను నిర్వర్తించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని అవసరమైన మందులను అందుబాటులో ఉండాలని.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారులను ఆదేశించారు.

**కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్...**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో అత్యవసర సహాయ సమాచార నిమిత్తం 08562 - 246344 కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ లేదా ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయానికి కానీ ఫోన్ ద్వారా తెలియజేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సూచించారు.

## కడపను అన్ని విధాల అభివృద్ధి చేస్తాం



**కడప రూరల్, మేజర్‌న్యూస్:** కడప నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రజల నుండి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు కడప నగరంలోని శివానందపురం 15వ డివిజన్ మెయిన్ రోడ్డులో 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పనుల కుగురువారం పూజలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కడప నగరంలో మౌలిక వసతుల అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నగరంలోని కాలువలు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ. ధనలక్ష్మి, డి.ఈ. దిల్షాద్. నాయకులు రెడ్డయ్య యాదవ్, మద్దూరు రాయుడు, షరీఫ్, రమణ, రాజోలు శివశంకర్, చంద్రా రెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, మిరియాల ఈశ్వరయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి



**కాశినాయన, మేజర్‌న్యూస్:** బద్వేల్ నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, బసిరెడ్డి రవీంద్రా రెడ్డి తెలిపారు. గురువారం ఆయన రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ రైతులు పైరు వేసేటప్పుడు సంబంధిత అధికారులతో ఈక్రాప్ చేపించుకోవాలని, ఈ క్రాప్ చేపించిన వారికి కచ్చితంగా నష్టపరిహారం వస్తుందని చెప్పారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని బద్వేల్ నియోజకవర్గం లో ఏడు మండలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వాటి ద్వారా రైతుల ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తుంది అని అన్నారు. అదేవిధంగా గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో కూడా పలు ధాన్యాలను కొనుగోలు చేస్తుందన్నారు. ప్రతి రైతు ధాన్యం అమ్ముకోవాలంటే సంబంధించిన రైతు భరోసా కేంద్రానికి వెళ్లి సంబంధిత అధికారులను సంప్రదించాలని అన్నారు.

# అప్రమత్తంగా.. ఉండండి!

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి అన్ని మండలాల ఎమ్మార్వోలతో పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నదులు.. వాగుల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్నారు. అల్పపీడన ప్రభావం మరో 24 గంటలు ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. భారీ వర్షాలపై దుబాయ్ నుంచి సీఎం నేరుగా మంత్రులు, జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షప్రభావిత జిల్లాలు నెల్లూరు, ప్రకాశం, కడప, తిరుపతి, అన్నమయ్య తదితర జిల్లాల పరిస్థితిపై మంత్రులు, సీఎస్, కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులతో మాట్లాడారు. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీవర్షాల కారణంగా తీవ్రంగా ప్రభావితం అయిన నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.1 కోటి చొప్పున అత్యవసర నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు ఎస్డీఆర్ బృందాలను, నెల్లూరు జిల్లాలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తక్షణం మోహరించాలని ముఖ్యమంత్రి సూచనలిచ్చారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, డిజాస్టర్, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, రహదారులు, భవనాలు, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలనీ ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలతో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఆహారం, పిల్లలకు పాలు లాంటి ఆహారపదార్ధాలను అందుబాటులో ఉంచాలన్నారు. దక్షణ కోస్తా, రాయలసీమ జిల్లాలలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు జిల్లా కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. తీవ్ర వర్షాల కారణంగా కాలువ, చెరువు గట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల పటిష్ట పరచాలని సీఎం అధికారులకు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం



కలగకుండా చూడాలని ఆదేశించారు. అలాగే పంట నష్టం జరక్కుండా చూడాలని సీఎం సూచనలిచ్చారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహాలతో చెరువులు నింపేందుకు చర్యలు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు.

**జిల్లాలో 1272.8 మి.మీటర్ల వర్షం..**

బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో 1272.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చెన్నూరులో 74.6 మి.మీటర్లు కురిసింది. మండలాల వారిగా పరిశీలిస్తే.. కొండాపురం 21.6 మి.మీ, మైలవరం 16.8, పెద్దముడియం 21.0, రాజుపాలెం 21.6, దువ్వూరు 25.6, మైదుకూరు 28.0, బ్రహ్మంగారిమట్టం 38.4, శ్రీ అవధూత కాశినాయన 65.2, కలసపాడు 42.0, పోరుమామిళ్ల 42.0, బి.కోడూరు 66.6, బద్వేల్ 41.2, గోపవరం 45.4, ఖాజీపేట 24.8, చాపాడు 31.6, ప్రొద్దుటూరు 19, జమ్మలమడుగు 17.6, ముద్దనూరు 22.8, సింహాద్రిపురం 29.4, లింగాల 12.6, పులివెందుల 19.4, వేముల 20.6, తొండూరు 35.2, వీరపునాయునిపల్లె 25.6, యర్రగుంట్ల 30.0 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అదేవిధంగా కమలాపురం 56.2, వల్లూరు 55.8, చెన్నూరు 74.6, అట్లూరు 65.8, ఒంటిమిట్ట 37.6, సిద్దవటం 32.6, కడప 47.4, చింతకొమ్మదిన్నె 48.6, పెండ్లిమర్రి 57.2, వేంపల్లి 21.2, చక్రాయపేట 11.8 మి.మీటర్లు కలిపి జిల్లా మొత్తం 1272.8 మి.మీటర్ల వర్షం కురిసింది. కాగా మరో 24 గంటల పాటు అల్పపీడన ప్రభావం జిల్లాపై కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

# కుళ్లుతున్న ఉల్లి

(మొదటి పేజీ తరువాయి)

దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. లాభాలు లేకున్నా ఫర్వాలేదు,కానీ పంటకు పెట్టిన పెట్టుబడులు వస్తే చాలు అనే ఆలోచనలో అన్నదాతలు ఉన్నారు. అష్ట కష్టాలు పడి పండించిన పంటకు ఒక్కసారిగా గిట్టుబాటు ధర పడిపోవడంతో రైతులకు ఏమి చేయాలో తోచడం లేదు. దాంతో గత 4 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఉల్లి పంట నూర్పిల్లు చేసి పొలాల్లోనే తడిసి పోతుండడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రాష్ట్రంలోనే ఉల్లి పంట సాగులో మొదటి స్థానంలో ఉన్న ఉమ్మడి కడప,కర్నూలు జిల్లా రైతులకు ఆ ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తోంది. ధర రోజురోజుకు పతనం కావడంపై ఇదేమీ ఘోరమంటూ రైతులు లబోదిబోమంటున్నారు. ఉల్లి పంటను విక్రయిస్తే పెట్టిన పెట్టుబడి గిట్టుబాటు అవడం లేదు. పంట చేతికొచ్చే సమయంలోనే ఉల్లిగడ్డ ధర పడిపోతుందని, నిల్వ చేసుకుందామంటే పాడైపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగ్గిన ధరలతో ఉల్లిగడ్డను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉల్లి గడ్డల ధర పడిపోవడంతో పంటను రైతులు వ్యవసాయ పొలంలోనే వదిలేస్తున్నారు. కొందరు రైతులు మద్దతు ధర లేకపోవడంతో పంటను పొలంలోనే, గొర్రెలకు, పశువులకు వదిలేస్తున్నారు. పంట పండించడానికి భూమిని చదును చేసింది బయట నుండి అప్పులు చేసి పంట పండిస్తే పండిన పంట ప్రయోజనం లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. దువ్వూరు మండలం దాసరి పల్లె, నీలాపురం, బాలాయపల్లె, మూడిండ్లపల్లె, మదిరేపల్లె, చిన్న సింగనపల్లె, చల్లబాసాయి పల్లె, గొల్లపల్లె, మానేరాంపల్లె గుడిపాడు, రామాపురం, మీర్జాఖాన్ పల్లె తదితర గ్రామాలలోని రైతులు ఎకరాకు60 వేల నుంచి 70 వేల రూపాయలు పెట్టుబడి పెట్టీ అప్పులో కురుకుపోయాము అంటూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. కనీసం కూలీల



ఖర్చులు కూడా రావడం లేదంటూ వాపోతున్నరు. వ్యయ ప్రయాసలకోర్చి దిగుబడిని మార్కెట్‌కు తెస్తే కోనేవారే కరువయ్యారని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కనీసం పంట పెట్టుబడి ఖర్చులైనా వచ్చేలా చూడాలంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కూటమి సర్కార్ ఉల్లి రైతులను ఏ విధంగా ఆదుకుంటుందో వేచి చూడాలి. గురువారం గుడిపాడు గ్రామంలోని రైతులు పోలక సుబ్బారెడ్డి, తమటం జయచంద్రారెడ్డి, వీరారెడ్డి, మనే రామ్ పల్లె గ్రామానికి చెందిన కోటా ఓబుల్ రెడ్డి, చల్ల బసాయి పల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి పల్లె జయరామిరెడ్డి, భూమిరెడ్డి పల్లె వెంకటలక్ష్మమ్మ,చిన్న సింగనపల్లి గ్రామానికి చెందిన బురగల చిన్న నరసింహులు, బూరగల పెద్ద నరసింహులు, ఇరగంరెడ్డి, తరకేశ్వరరెడ్డి, తదితర రైతులు పంట పొలాల్లోనే వర్షానికి తడిసి కుళ్లిపోతుందడంతో రైతులు ఏడుస్తూ వాపోతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు పంట పొలాల్లో ఉల్లిని విడిచిపెట్టి ట్రాక్టర్లతో సేద్యం చేశారు. ప్రభుత్వము ఉల్లి రైతులను ఆదుకోవాలని వారుప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఒకరో ఇద్దరో ప్రజా ప్రతినిధులు తప్ప జిల్లాలోని ప్రజా ప్రజా ప్రతినిధులు ఉల్లిగడ్డల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు అనుకుంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్రంలో పండించిన ఉల్లి రైతులందరినీ ఉద్యానవన శాఖ అధికారులతో చర్చించి రైతన్నలకు ఆర్థిక సహాయం అందజేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


## ప్రభుత్వ బాలుర వసతి గృహం లేక విద్యార్థులు ఇక్కట్లు

**కాశినాయన, మేజర్‌న్యూస్ :** కాశినాయన మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో, మోడల్ స్కూల్ నందు చదువుతున్న విద్యార్థులకు వసతి గృహము లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు తెలియజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా చాలావరకు భయాం దోళనకు గురవుతున్నారు. వివరాలలోనికి వెళ్తే చాలా సంవత్సరాల నుండి మం డలంలో హాస్టల్ లేదు. విద్యార్థులు అయితే100 నుండి 120 వరకు ఉన్నారు. వీరిని బాడుగ ఇల్లు తీసుకొని హాస్టల్లో కొనసాగిస్తున్నారు. అయితే వీరికి ఉండేందుకు పడుకునేందుకు, స్థలం లేదు. గదులు లేవు,



అధికారులు వెంటనే స్థలం ఏర్పాటు చేసి విద్యార్థులకు వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు కోరుచున్నారు.

# పెండింగ్ లో ఉన్న కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి- సిఐటియు



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని పనిచేస్తున్న శానిటేషన్ , సెక్యూరిటీ కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు రావడంలేదని సిఐటియు ఆధ్వర్యంలో హాస్పిటల్ సూపర్నంట్ డాక్టర్ శివ కృష్ణకు కార్మికుల జీతభత్యాలు పరిష్కరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటి జిల్లా ఉపాధ్యక్షులు యన్ భైరవ ప్రసాదు మాట్లాడుతూ పోరుమామిళ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నటువంటి శానిటేషన్ వర్కర్లు,సెక్యూరిటీ వర్కర్లకు సక్రమంగా నెలల జీతాలు ఇవ్వకుండా వాళ్ళ కుటుంబాలను అప్పుల ఊబిలో దించుతూ ఉన్నారని వారన్నారు. ఇప్పటికే నాలుగు నెలల జీతాలు ఇవ్వలేదని గతంలో పెండింగ్లో ఒక నెల జీతాలు కూడా ఇవ్వలేదని వారు అన్నారు దసరా పండుగ, మరియు దీపావళి పండుగ రెండు పండగలు పోయినా గాని ఇంతవరకు కార్మికులకు జీతాలు ఇవ్వకుండా అప్పుల బారిన చేయడం చాలా దుర్మార్గమని వారు అన్నారు. వెంటనే శానిటేషన్ వర్కర్లకు సెక్యూరిటీ వర్కర్లకు జీతాలు కల్పించాలని వారున్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ కార్మిక వర్కర్లు బాల మేరి, కారు మాధవి, ధనమ్మ, సుబ్బమ్మ,విజయ కుమారి, రామసుబ్బమ్మ,వసంత, జ్యోతి, మరియమ్మ సెక్యూరిటీ కార్మికులు సిఐటియు నాయకులు కుసలూరి రవి తదితరులు పాల్గొన్నారు.


# విస్తరణ పనులకు మోక్షం ఎప్పుడో..?

### కాంగ్రెస్ సీనియర్ నేత డా.ఎన్.తులసిరెడ్డి
### కడప-రేణిగుంట జాతీయ రహదారి పనులు చేపట్టాలి



**వేంపల్లె, మేజర్‌న్యూస్:** కడప-రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనులకీ మోక్షం ఎప్పుడో? అని కాంగ్రెస్ సీనియర్ నేత డా.ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడేళ్ల కింద కేంద్ర ప్రభుత్వం కడప, రేణిగుంట జాతీయ రహదారి విస్తరణ పనులకీ రూ. 3232 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ పనులకీ లక్ష్మి ఇన్ఫ్రా సంస్థకు టెండర్ దక్కిందన్నారు. రెండేళ్లు దాటిన ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. చెన్నై, ముంబై నగరాలకు కలుపుతూ ఈ జాతీయ రహదారి సాగుతుందన్నారు. ఈ రహదారిపై రద్దీ ఎక్కువని, తరచూ ప్రమాదాలు సంభవిస్తుంటాయని తెలిపారు. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఏ మాత్రం ఆలశ్యం చేయకుండా పనులు ప్రారంభించి, పూర్తి చేయాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఆదివారం గడియారం 44వ సాహిత్య పురస్కార ప్రదాన సభ



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** రచన సాహిత్య వేదిక, గడియారం వారి కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో దివంగత మహాకవి డాక్టర్ గడియారం వేంకట శేష శాస్త్రి 44వ సాహిత్య పురస్కార ప్రదాన సభ ఆదివారం నిర్వహిస్తు న్నట్లు రచన సాహిత్య వేదిక అధ్యక్షులు విహారి (జె.యస్.మూర్తి), కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక వై.యం. ఆర్. కాలనీలోని అరబిందో ఇంటెగ్రల్ హైస్కూల్ (అరవిందాశ్రమం) నందు జరిగే ఈ కార్యక్రమంలో స్వాగతో పన్యాసకులుగా రచన సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు గడియారం వేంకట శేషశర్మ, సభాధ్యక్షులుగా ప్రముఖ కథారచయిత డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్, పురస్కార ప్రదాత రచన సాహిత్య వేదిక అధ్యక్షులు విహారి (జె.యస్. మూర్తి), ముఖ్య అతిథిగా ప్రముఖ కవి ఎ.సి. దస్తగిరి, మునిసిపల్ కమీషనర్ సి.హెచ్.రవిచంద్రారెడ్డి, పురస్కార గ్రహీత హైదరాబాదు కు చెందిన యువకవి, సాఫ్ట్వేర్ ఇంజనీర్ పరిమి శ్రీరామనాథ్ విచ్చేస్తారని వివరించారు. పరిమి శ్రీరామనాథ్ రచించిన జీవాతువు పురస్కారం పొందిన కావ్యమని, కావ్య పరిచయం కడపకు చెందిన ప్రముఖ అవధాని శారదా ప్రసన్న చేయనున్నారని తెలిపారు. రచన సాహిత్య వేదిక కార్యదర్శి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యవర్గ సభ్యులచే ప్రశంసాపత్రం, పురస్కార పత్రం అందిస్తున్నామని వివరించారు. కావున సాహితీ ప్రియులకు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవ్వండి

### మండల అధ్యక్షుడు ఎస్. పి.జి.ఆర్.



**పెండ్లిమర్రి, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పొలతల నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా యువకుడు, ఉత్సాహవం తుడు, పనిపట్ల అంకితభావం గల సిరిగి రెడ్డి రాజారెడ్డి ఆలయ నూతన చైర్మన్‌గా శనివారం ఉదయం 10 గంటలకు ప్రమా ణ స్వీకారోత్సవం చేస్తుండటం సంతోష దాయక మని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్త నరసింహారెడ్డి, కమలాపురం శాసనసభ్యులు యువ నాయకులు పి.కృష్ణ చైతన్య రెడ్డి హాజరవుతున్న సందర్భంగా మండలంలోని తెలుగుదేశం పార్టీ కూటమి సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు..

# ప్రజల ఆరోగ్యం విస్మరించి విదేశీ పర్యటనలా

### ఆరోగ్యశ్రీకి అనారోగ్యం కల్పించిన కూటమి ప్రభుత్వం
### కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఆరోగ్యశ్రీని విజయవంతంగా నడిపిన ఏకైక మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి
### రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంపై వైసిపి ఎస్ఈసి సభ్యుడు సాయినాథ్ శర్మ అగ్రహం




**కమలాపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు చేయడం వల్ల రాష్ట్ర ప్రజలకు రాష్ట్రానికి వరగపెట్టేధేమీ లేదని వైసీపీ రాష్ట్ర ఎస్ ఈ సి సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు .కమలాపురంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 14 రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఆసుపత్రులలో ఆరోగ్య శ్రీ సేవలు అందకపోవడంతో అనారోగ్య పాలైన అనేకమంది నిరుపేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు.లక్షలు, వేల రూపాయలు చెల్లించి ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు చేపించుకోలేక నిరుపేద ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చరిత్రలో 14 రోజులు ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడం ఆసుపత్రి యాజమాన్యాలు మహా ధర్నాకు పిలుపు ఇచ్చి రోడ్డు ఎక్కడం, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించడం, రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారిగా ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వంతో పొత్తు పెట్టుకుని కోట్లాది రూపాయల నిధులు రాష్ట్రానికి తెచ్చుకుంటూ ఆరోగ్యశ్రీని విస్మరించడం ఎంతవరకు భావ్యమని ఆయన దుయపట్టారు. రాష్ట్రంలో గత సార్వత్రిక ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలుపొందామని వైసీపీకి ప్రతిపక్ష కూడా హొదా కూడా లేకుండా చేశామని చంకలు గుద్దుకుంటున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి లేకపోవడం విచారకరమన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని ఏమాత్రం అడ్డంకి లేకుండా నిర్వహించిన ఏకైక మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకురావడానికి పరిశ్రమలు స్థాపించడానికి ఎవరు వ్యతిరేకం కాదని కానీ ప్రజల ఆరోగ్యాన్ని సంక్షేమాన్ని గాలికి వదిలేసి కేవలం పెట్టుబడులు పరిశ్రమల కోసం విదేశాల చుట్టూ బాధ్యత లేకుండా తిరుగుతుండడం శోచనీయమన్నారు. ప్రజల ఆరోగ్యమే రాష్ట్రానికి మహాభాగ్యం అని ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి ఎన్ని పెట్టుబడులు ఎన్ని పరిశ్రమలు తెస్తే మాత్రం ఏం ఉపయోగముందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ నాయకులు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ని పేద ప్రజలకు చేరువ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### ఖాజీపేట మండల వైసిపి నాయకులు డిమాండ్




ఖాజీపేట, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కొమ్మలూరు పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి పంట నేలవాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. బాధిత రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.గురువారం నాడు వైసీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి కొమ్మలూరు గ్రామంలో అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపాలన్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కొమ్మలూరు సర్పంచ్ ఆదినారాయణ రెడ్డి, ఓబుల్ రెడ్డి, త్రిపురవరం మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ డీలర్ బాలకృష్ణ రెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, ఏటూరు అంబటి శివారెడ్డి, కూనవరపల్లి చిన్న సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసంలో ప్రొద్దుటూరు అరుణాచలం ప్రత్యేక బస్సు సర్వీసులు

**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** కార్తీక మాసంలో ప్రొద్దుటూరు అరుణాచలం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా అక్టోబర్ 26 వతేది మరియు నవంబర్ 2 వ తేదీ 9 వ తేదీ 16 వతేది సాయంత్రం 6 గంటలకు ప్రొద్దుటూరు డిపో వారు అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రొద్దుటూరు డిపో నుండి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందని, అదేవిధంగా నవంబర్ 4 వతేది మధ్యాహ్నం 1 గంటలకు కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రొద్దుటూరు ఏపీ ఎస్ ఆర్టీసి డిపో వారు అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రొద్దుటూరు డిపో నుండి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయటం జరిగిందని వివరించారు.కావున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాను పోను టికెట్ ధర 1250/- టికెట్స్ 9966525210 లేదా ఏపిఎస్ఆర్టీసిఆన్లైన్.ఇన్ ద్వారా పొందవచ్చని తెలిపారు. గ్రూపుగా 35 మంది భక్తులు వచ్చినచో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# మైదుకూరు మండల ఎస్టీయు అధ్యక్షులుగా కిరణ్ కుమార్




**మైదుకూరు, మేజర్‌న్యూస్ :** మైదుకూరు పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ కళ్యాణ మండపంలో బుధవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం మైదుకూరు రీజియన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మైదుకూరు ఎస్టీయు మండల శాఖకు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో మండల శాఖ అధ్యక్షులుగా ఎన్. శెట్టిపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గోవిందిన్నె కిరణ్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది, అలాగే గంజికుంట హరిజనవాడ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈనెపాటి ఈశ్వరయ్యను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది , అలాగే సాయినాధపురం మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కే.విజయసింహ రాజును ఆర్థిక శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన మైదుకూరు మండల రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మండలంలోని ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.ఈ ఎన్నికలకు పి.రమణారెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

# బద్వేలు నియోజకవర్గ స్థాయిలో టీడీపీకి పూర్వ వైభవం రితీష్ రెడ్డికే సాధ్యం

### రితీష్ రెడ్డి యువసేన  యువ నాయకులు గోడి.వినోద్ కుమా[రెడ్డి, వెంగలరాయుడు

**కలసపాడు:మేజర్‌న్యూస్ :** మండల రితీష్ రెడ్డి యువసేన నాయకులు గోడి వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ :బద్వేలు నియోజక వర్గంలోని ఏడు మండలాల్లో తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకులను,కార్యకర్తలను ఏక తాటిపై నడిపించ గల శక్తి సామర్థ్యం కలిగిన ఏకైక నాయకుడు స్వర్గీయ మాజీ మంత్రి వర్యులుబిజివేముల వీరారెడ్డిమనుమడు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తనయుడు కొనిరెడ్డి రితీష్ కుమార్ రెడ్డి టిడిపి కార్యకర్తలను, నాయకులను టిడిపి ఆశావహులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీపీ పలువురు నాయకులను సమకూర్చి పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చే శక్తి సామర్థ్యం కలిగిన ఏకైక నాయకుడు బద్వేలు నియోజక వర్గ ఇన్చార్జి రితీష్ కుమార్ రెడ్డికే అన్ని విధాలా శక్తి సామర్థ్యాలు బద్వేల్ టీడీపీ ఇంచార్జి రితీశ్ రెడ్డి కి ఉన్నాయని కలసపాడు మండలంలోని రితిస్ రెడ్డి యువసేన లింగారెడ్డి పల్లె యువ నాయకులు గోడి వినోద్ కుమార్ రెడ్డి ,పోకల వెంగలరాయుడు,ఆశాభావం వ్యక్తం చేశారు, తెలుగుదేశం పార్టీ మొదటినుండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న దివంగత మంత్రి వర్యులు వీరారెడ్డి వారసత్వం ,ఆయన కుటుంబం అహర్నిశలు కష్టపడ్డారు, ఈ విషయం నియోజకవర్గ ప్రజలకి తెలిసిన విషయమే, కావునఎల్లప్పుడూ వారి కుటుంబానికి మా మద్దతు ఉంటుంది, వీరారెడ్డి మరణానంతరం ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే విజయమ్మ,ప్రజలకి,అందు బాటులో ఉండి కార్యకర్తలకి నిత్యం వారి సమస్యలు విని పరిస్కారం చేస్తున్నారు. ప్రస్తుతం యువ నాయకుడుగా ఉన్న రితీశ్ కుమార్ రెడ్డి యువకులను, సీనియర్లును కలుపుకొని పార్టీ ని పూర్తి స్థాయిలో, అన్ని విధాలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పార్టీ అభివృద్ధి కి నిత్యం కట్టుబడి పని చేస్తున్న వీరారెడ్డి కుటుంబానికి నియోజకవర్గ ప్రజలు జేజేలు పలుకుతారని మండల రితిస్ రెడ్డి యువసేన యువ నాయకుడు గోడి వినోద్ కుమార్ రెడ్డి ఆది బోయిన మనోజ్ కుమార్ పేర్కొన్నారు



# పొలతల దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం

### నూతన చైర్మన్ గా సిరిగిరెడ్డి రాజారెడ్డి... (సింగపూర్ రాజా)

**పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పొలతల మల్లేశ్వర స్వామి దేవస్థానానికి నూతన పాలకమండలి 25 వ. తేదీ శనివారం ఉదయం 10:45 నిమిషాలకు ఏర్పాటు కాబోతున్నట్లు ఆలయ నూతన చైర్మన్ సిరిగిరెడ్డి రాజారెడ్డి తెలిపారు..ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి,, కమలా పురం నియోజకవర్గ శాసనసభ్యులు కృష్ణ చైతన్య రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా.. నరసింహారెడ్డి హాజరవుతున్నట్లు, కావున ఈ కార్యక్రమానికి భక్తాదులు ఎల్లరు విచ్చేసి జయప్రదం చేయవలసినదిగా ఓ ప్రకటనలో తెలిపారు.

# బోనాల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో ఎనీ టైం మనీ మాడల్

**లింగాల మేజర్‌న్యూస్ :** లింగాల మండలం బోనాల గ్రామం లో మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఐ సి ఆర్ పి, పి వి.%జూజ% రమణ,ఓన్ ఫీల్డ్ ఏటీఎం,మోడల్ 20 సెంట్లు లో బెడ్స్ తయారు చేసి బీజామృతం తో విత్తన శుద్ధి చేసి ఘన జీవామృతం చల్లుతూ విత్తనాలు పెట్టడం జరిగింది. 20 రకాలు వెరైటీ విత్తనాలు వాటిలో విత్తనాలు రకాలు ,ముల్లంగి,బీట్రూట్,క్యారెట్,మటిక,బెండ,అనప,అలసంద,చిక్కుడు,బీన్స్,కాకర ,బీర,సొర, మెంతి ఆకు ,కొత్తిమీర,చుక్కఆకు,పాలకూర,తోట కూర ,గోంగూర,కోయ్యటాకు,మొక్కజోన్న ఇలా అన్ని 20 రకాలు విత్తనాలు పెట్టించడం జరిగింది . మరియు టమోటా, మిరప, వంగ నారు బీజామృతం తో నారు శుద్ధి చేసి నాటడం జరిగింది మరియు బాడర్ క్రాప్,గా సజ్జ, జొన్న తీగ జాతులు వేయించడం జరిగింది. ఈ మోడల్ వేసుకోవడం వలన ఎలాంటి పురుగు మందులు రసాయనాలు లేకుండా పండించుకుని ఆరోగ్యకరమైన కూరగాయలు తిని మిగిలినవి అమ్ముకొని 15 రోజుల నుండి ఆకుకూరలు కూరగాయలు గడ్డ జాతి నుండి ఆదాయాన్ని పొందవచ్చని ఎనీ టైం మనీ పొందవచ్చని ఈ మోడల్ ను వేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యామిని లత.యూనిట్ ఇంచార్జ్ జయనాయక్ ఐ సి ఆర్ పి యశోద,శోభారాణి , పాల్గొన్నారు.



# పుష్పగిరి రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లు తొలగింపు



**చెన్నూరు మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ఉప్పరపల్లి నుండి పుష్పగిరికి వెళ్లే రహదారిపై వర్షాల కారణంగా ఇరువైపులా కంపచెట్లు అధికంగా పెరిగి దారికి అడ్డుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు 'సూర్య' దినపత్రిక బుధవారం సంచికలో "పుష్పగిరి రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లు" అనే శీర్షికన కథనం ప్రచురితమైంది.ఈ కథనానికి స్పందించిన రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకొని రహదారి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను ఎక్స్కవేటర్ సాయంతో తొలగించారు.కంపచెట్లు తొలగించడంతో రహదారి మళ్లీ వాహన రాకపోకలకు అనుకూలంగా మారింది.ఈ చర్యపై పలువురు వాహనదారులు, స్థానిక గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, వెంటనే స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రవేటీకరణను ఆపాలి

### - వైద్య పోరాట ధర్నా. - జీవో నెంబర్ 590 ను వెంటనే రద్దు చెయ్యాలి..
### - బహుజన సమాజ్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు సాగిలి గుర్రప్ప డిమాండ్. - పులివెందుల ఆర్డిఓ కి వినతి...






**పులివెందుల మేజర్‌న్యూస్ :** పబ్లిక్, ప్రవేట్, పార్ట్నర్షిప్ పిపిపి పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, పిపిపి విధానంతో బడుగు, బలహీన, వర్గాల పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దని ఎన్డీఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, గురువారం నాడు పులివెందుల పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డిఓ చిన్నయ్య కి వినతి పత్రం అందజేశారు..ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు సగిలి గురప్ప రాష్ట్ర కార్యదర్శ ఓబయ్య సత్యసాయి జిల్లా కార్యదర్శి రాంప్రసాద్ కడప జిల్లా ఇన్చార్జి బాలచంద్ర ఇరువురు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి పులివెందుల ,మార్కాపురం ఆదోని, మదన పల్లి, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ, పార్వతీ పురం, 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ఎన్డీఏ ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రైవేటికరణ చేసి రాష్ట్రంలోని బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలో భాగంగా వైద్య విద్యను నిర్వీర్యం చేస్తూ, జీవో నెంబర్ 590 తీసుకొచ్చి బడుగు,బలహీన పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య దూరం చేస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి పద్దు కింద, కేంద్ర ప్రాయోజిత పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు సాధించకుండా, రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని నెపంతో పిపిపి విధానంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి 10 మెడికల్ కళాశాలలను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మాయ మాటలు చెబుతూ, వైద్య విద్యను కార్పొరేట్ కబంద హస్తాలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.దీని ద్వారా ప్రజా ఆరోగ్యం కూడా అస్తవ్యస్తంగా మారుతుందని వారు విచారణ వ్యక్తం చేశారు.పిపిపి విధానంతో 10 మెడికల్ కళాశాలలను పూర్తి చేస్తే వైద్య విద్య బడుగు బలహీన పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు అందని ద్రాక్షాల మారుతుందని, అంగట్లో సరుకు లాగా వైద్య విద్య మారే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్ 590 ను రద్దు చేసి, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోని, పూర్తిస్థాయిలో ప్రభుత్వ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేసి, కొనసాగించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని యెడల బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రస్థాయిలోకి తీసుకెళ్తామన్నారు..ఈ కార్యక్రమంలో కడప జిల్లా ప్రధాన కార్యదర్శి బేబీ జిల్లా కార్యదర్శి రవి ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షులు కిరణ్ బద్వేల్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ కడప అసెంబ్లీ అధ్యక్షుడు ఓబులేష్ కదిరి అసెంబ్లీ అధ్యక్షులు ఆదినారాయణ సాంబశివ గంగాధర్ ముత్తన్న కడప జిల్లా నాయకులు గంగన్న సుబ్బరాయుడు పుష్పరాజ్ పెద్ద ఎత్తున బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# కార్తీక మాస తొలి గురువారం సాయినాథునికి విశేష పూజలు

### ఆలయ ప్రాంగణం దీపాలంకరణ - ఆలయ అభివృద్ధికి సహకరించండి
### ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలోని పార్నపల్లి రోడ్డు మొట్ట మొదటగా కొలువైయున్న షిరిడి సాయిబాబా ఆలయంలో కార్తీకమాసం మొదటి గురువారం షిరిడి సాయినాధునికి విశేష పూజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ప్రాంగణం దీపాలంకరణలతో మొ క్కులు చెల్లిం చారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చ కులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఉభయ దారులచే తెల్లవారుజామున నుండి షిరిడి సాయి నాధునికి కాకడ హారతి పంచా మృతాబి . షేకం, సహస్రనామార్చన, తదితర పూజ కైంక ర్యాల అనంతరం షిరిడి సాయినాధుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లా డుతూ ప్రతి గురువారం భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్య క్రమాలు చేపట్టడం జరుగుతుందని ,ఈ కార్తీకమాసంలో ప్రతిరోజ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉదయము సాయంకాలము దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి దీవెనలు అందుకుంటున్నారని, అన్నదాన కార్యక్రమాలకు భక్తులు ఎవరైనా వస్తురూపమైన ధన రూపేనా సహాయం చేయదలచిన వారు ఆలయంలో సంప్రదించవలెనని తెలిపారు

### ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించండి

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# బ్రహ్మ సాగర్ నుండి వచ్చే నీటితో నిండు కుండలా పెద్ద చెరువు

- మాజీ ఎమ్మెల్యే విజయమ్మ.. - అధికారులతో కలిసి పెద్ద చెరువును పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ.. - పెద్ద చెరువు నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చెరువులను నింపడానికి ప్రణాళికలు.. - చెరువుల మరమ్మత్తుల కొరకు జిల్లా కలెక్టర్ అనుమతులు తీసుకుంటాం..



**బద్వేల్ మేజర్న్యూస్ :** బ్రహ్మ సాగర్ నుంచి విడుదలయ్యే నీటితో బ ద్వేల్ పెద్ద చెరువు నీటి కుండల మారిందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే నీటితో నిండిన బద్వేల్ పెద్ద చెరువును గురువారం నాడు బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ తెలుగు గంగ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తెలుగు గంగ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రహ్మ సాగర్ నుండి వచ్చే నీటితో పెద్ద చెరువు నిండుకుండలా పరువలు తొక్కడం సంతోషదాయ కమన్నారు. కరువుతాండవించేరాయలసీమలో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రాజెక్టులన్ని నీటితో పరవళ్ళు తొక్కుతున్నాయన్నారు. గొలుసు కట్టు చేరువైన పెద్ద చెరువు నుంచి నియోజకవర్గంలోని చెరువుల అన్నింటిని నింపడం పై అధికారులతో చర్చించారు. పెద్ద చెరువు నుంచి విడుదల చేసే నీటితో అన్ని చెరువులు నిండాలని ఏదైనా చెరువుకు మరమ్మత్తులు అవసరమైతే జిల్లా కలెక్టర్ అనుమతులు తీసుకొని మరమ్మత్తులు చేయాలని అధికారులకు సూచించారు. నేల పై రాలే ప్రతి నీటి బొట్టును ఒడిచిపట్టి రైతుల పంటలకు ప్రాణం పోయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తెలుగు గంగా అధికారులు నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ కే ఆర్ ఎస్ కే ఆర్ కళాశాలలో పేరెంట్ సమావేశం

**కడప ఎడ్యుకేషన్ మేజర్న్యూస్ :** ఎస్ కే ఆర్ ఎస్ కే ఆర్ స్థానిక గవర్నమెంట్ మహిళ డిగ్రీ కళాశాల కడపలో డిపార్ట్మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరంలో చేరిన విద్యార్థినుల పేరెంట్స్ మీటింగ్ (సమావేశం) నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుచూ డిగ్రీ విద్య కేవలం మార్కులకు మాత్రమే పరిమితం కాకుండా, మీ పిల్లలకు ప్రపంచస్థాయి నైపుణ్యాలను అందించడమే మా లక్ష్యం. నూతన విద్యా విధానానికి అనుగుణంగా పాఠ్య ప్రణాళికను గవర్నమెంట్ తయారు చేసిందని తెలిపారు. తరగతి గది బోధనతో పాటు, విద్యార్థులకు క్లిష్టమైన ఆలోచనా నైపుణ్యాలను పెంచే వర్క్షాప్లు, సెమినార్లు, ఇండస్ట్రియల్ టూర్స్ని తరచూ నిర్వహిస్తున్నాం. విద్యార్థులు తరగతికి తప్పనిసరిగా హాజరు కావాలి. 75% హాజరు కంటే తక్కువ ఉన్న విద్యార్థులు పరీక్షలకు అనర్హులుగా ప్రకటించబడతారు, కాబట్టి దయచేసి దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మరియు పిల్లలకు సెమిస్టర్ విధానంలో అంతర్గత పరీక్షలు (ఇంటర్నల్స్ ) అత్యంత కీలకం. వాటిలో చూపిన ప్రతిభ తుది ఫలితాన్ని నిర్ణయిస్తుంది. ప్రతి విద్యార్థి తమ సన్నద్ధతను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, మేము క్రమం తప్పకుండా యూనిట్ టెస్టులు నిర్వహిస్తున్నామను తెలిపారు.తల్లిదండ్రుల సహకారం ఉంటేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి అని వివరించారు. అనంతరం డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ కళాశాల ఒక ఆలయం లాంటిది. ఇక్కడ విద్యార్థులు ఉన్నతమైన క్రమశిక్షణతో మెలగాలి. ర్యాగింగ్, అసాంఘిక కార్యకలాపాలు మా క్యాంపస్లో పూర్తిగా నిషేధించబడ్డాయి. సమయపాలన, అధ్యాపకులకు, తోటి విద్యార్థులకు గౌరవం ఇవ్వడం, క్యాంపస్లో మొబైల్ ఫోన్ వినియోగంపై నియంత్రణ పాటించడం వంటి అంశాల్లో విద్యార్థులు నిబద్ధతగా ఉండాలి. క్రమశిక్షణ కలిగిన విద్యార్థి మాత్రమే సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరుకోగలడు.కేవలం అకాడమిక్స్ మాత్రమే కాకుండా, విద్యార్థులలోని సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలికితీయడానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్.సి.సి (ఎన్సిసి), ఎన్.ఎస్.ఎస్




(ఎన్ఎస్ఎస్) వంటి కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాము మీరు ఎన్సిసి ఎన్ఎస్ఎస్, వై ఆర్ సి, ఆర్ ఆర్ సి వంటి వాటిలో చేరడం ద్వారా విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యకలాపాలు ప్లేస్మెంట్లలో వారికి ఎంతగానో ఉపయోగపడతాయి.ప్రతి విద్యార్థి పురోగతిని, హాజరును, అంతర్గత మార్కులను పర్యవేక్షించడానికి మేము శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు దయచేసి మీ పిల్లల మెంటార్ను తరచుగా సంప్రదించి, వారి చదువు గురించి తెలుసుకోండి. ఇంట్లో వారికి చదువుకోవడానికి ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించండి. మీ సహకారం లేనిదే, మా ప్రయత్నాలు పూర్తి స్థాయిలో ఫలించవు. అనంతరం బోటనీ లెక్చరర్ నాగరత్నమ్మ మాట్లాడుతూ కళాశాల మీ పిల్లల అభివృద్ధికి చక్కగా తోడ్పడుతుందని దీనికి మీ సహకారం అవసరమని తద్వారా మీ పిల్లలను ఉన్నత శిఖరాలలో చూడవచ్చని తెలిపారు. అనంతరం బోటనీ లెక్చరర్ అనురాధ మాట్లాడుతూ కళాశాలలో క్రమశిక్షణ ఎంత అవసరమో అదే విధంగా హాస్టల్లో ఉన్న విద్యార్థినులకు కూడా అంతే అవసరమని హాస్టల్లో కూడా క్రమశిక్షణతో పాటించి మంచి స్నేహితులతో ఉండి బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కాలేజీకి మంచి పేరు తేవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కూడా ప్రతి ఒక్కరు మాట్లాడడం జరిగిందని డిపార్ట్మెంట్ హెడ్ వివరించారు.

## ప్రజలకు స్వచ్ఛమైన కల్తీ లేని పాలు విక్రయించాలి

పాల విక్రయ కేంద్రాలను తనిఖీ - మున్సిపల్ కమిషనర్ రాముడు



**పులివెందుల మేజర్న్యూస్ :** పులివెందుల మున్సిపల్ కమిషనర్ డి రాముడు గురువారం ఉదయం మారుతి హాల్ రోడ్డు లోని పలు పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసినారు. ప్రజలకు స్వచ్ఛమైన కల్తీ లేని పాలను విక్రయించాలని సూచించారు.అలాగే ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లలలో పాలను ప్యాక్ చేసి వినియోగ దారులకు ఇవ్వకుండా వారిని క్యారియర్ లను తెచ్చుకొనేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచి వాలయ శానిటరీ సెక్రటరీలు పాల విక్రయ కేంద్ర యజమానులు పాల్గొన్నారు.

## కలుషితమైన నీరు తాగి అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవద్దు

మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డా" కళ్యాణ్ చక్రవర్తి



**పోరుమామిళ్ల మేజర్న్యూస్ :** వర్షం వచ్చినప్పుడు కలుషితమైన నీరు తాగి ప్రజలు అనారోగ్యం కొనితెచ్చుకోవద్దు మాజీ ఆప్కాస్ బోర్డు మెంబర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన పేర్కొ న్నారు. కడప జిల్లాలో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిందని, అలాగే ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు వాగులు వంకలు దాటేటప్పుడు జాగ్ర త్తగా చూసుకొని వెళ్లాలన్నారు. అనవ సరం గా ప్రయాణాలు చేయకూడదని తెలియజేశారు. వర్షంలో అంటువ్యాధులు పెరిగే అవకాశం ఉందని ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకూడదని సూచించారు. తాగునీటిని కాల్చి చల్లార్చి తాగడం మంచిది అన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలి చల్లారిన భోజనం కాకుండా వేడిగా భోజనం భుజించాలన్నారు. చెరువుల దగ్గర ఎవరైనా గల్లం తయితే పోలీస్ కంట్రోల్ రూమ్ కి కాల్ చేసి సహాయం అడగాలన్నారు.

# ఘనంగా రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన సేవా కార్యక్రమాలు

అందులకు, వికలాంగులకు అన్నదానం



**పులివెందుల మేజర్న్యూస్ :** రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు పులివెందుల హరి, హిమం పీరా, అభిషేక్, అన్వేష్, మహేష్, సన్నీ, శశాంక్, సుమంత్, రమణ, సామెల్, చిన్న, ఫక్రుద్దీన్ లు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని పూల అంగళ్ళ సర్కిల్ వద్ద బాణాసంచా పేలుస్తూ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాప్రభాస్ జన్మదిన కేకును ఏర్పాటు చేశారు. ఈ కేకును కట్ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మా ఊరి సినిమా, రిచ్ కిడ్ ప్రొడ్యూసర్, మంజునాథ్ రెడ్డి కట్ చేసి వారికి పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న శ్రీ వీరనారాయణ స్వామి అందుల ఆశ్రమంలో అందులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే పార్నపల్లె రోడ్డు లో ఉన్న దీనబంధు ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నం ప్యాకెట్లను పులివెందుల హరి యూట్యూబ్ ఛానల్ వారు, పులివెందుల హరి, చంద్రమోహన్ రెడ్డి, పఠాన్, మురళి, భాష, చక్కని హరి, శ్రీనాథ్ రెడ్డి లుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ అభిమానులు మాట్లాడుతూ తమ అభిమానం నటుడు రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదిన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. కరోనా సమయంలో ఆపదలో ఉన్న వ్యక్తులకు తమ హీరో ప్రభాస్ సహాయం చేశాడని, ఆయన స్ఫూర్తితో తాము అన్నదాన కార్యక్రమాలను చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెబల్ స్టార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయుల పట్ల చులకన భావం తగదు

-ఎస్టీయు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సి.వెంకటరెడ్డి,బి.ఎన్.వి.ప్రసాద్

**కలసపాడు మేజర్న్యూస్ :** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులను చులకన భావంతో చూసే వైఖరి మానుకోవాలని ఎస్టీయూ కలసపాడు మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి,బి.ఎన్.వి ప్రసాద్ లు ప్రభుత్వానికి హితవు పలికారు. మండల కేంద్రమైన కలసపాడులో నిర్వహించిన ఒక సమావేశంలో వెంకటరెడ్డి,ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసి,ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చడంలో విశేషకృషి చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు వ్యవహరించే తీరు సరిగా లేదన్నారు.గత ప్రభుత్వాలలో సాధించుకున్న ఎన్నోరకాల ప్రయోజనాలకు నేటి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తూ,ఉద్యోగ ఉపాధ్యాయులను నిరంకుశ ధోరణితో చూడడం పాలకులకు పరిపాటై పోయిందన్నారు. పిఆర్సి,ఐఆర్ ప్రకటన,డిఏల ప్రకటన మరియు బకాయిల చెల్లింపు,సరెండర్ లీవ్ చెల్లింపులు, పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఆవేదనతో రగిలిపోతున్నారన్నారు. ప్రభుత్వాలు ఆనవాయితీగా వస్తున్న ఆర్థిక ప్రయోజనాలను అమలు చేయకపోగా ఉద్యోగ ఉపాధ్యాయులు జీతం నుండి మినహాయించుకుని పొదుపు చేసుకున్న జిడ్పిపిఎఫ్,ఏపీజిఎల్ఐ లాంటి లోన్లు,ఫైనల్ పేమెంట్ల విషయంలో కూడా



ప్రభుత్వ సొమ్ము ఇస్తున్నట్లు వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వంలో భాగంగా గుర్తించి, వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి 12వ పిఆర్సి కమిషన్ నియమించి, వెంటనే 30 శాతం ఐఆర్ ను ప్రకటించడంతోపాటు,11వ పిఆర్సి బకాయి లుడిఏ బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపులు చేపట్టాలన్నారు .లేనిపక్షంలో మరో బిఆర్టిఎస్ లాంటి మహోద్యమాన్ని చవిచూడక తప్ప దన్నారు.కార్యక్రమంలో జిల్లాకార్యవర్గ సభ్యులు ఎం.శేఖర్ బాబు, ఎస్.వి.సత్యనారాయణ,వినోద్, శివారెడ్డి,బాలరాజు నాయక్ పాల్గొన్నారు.

# ఫుడ్ ఇన్స్పెక్టర్తో సమావేశమైన ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ప్రతినిధులు

**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** కడప టౌన్ ద్వారకానగర్ లోని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆఫీస్ నందు జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ డా!హరిత తో ది, ఎన్. సి. ఆర్. సి. నాయకులు రాష్ట్ర చైర్మన్ (అడ్మిన్ ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం లో ఫుడ్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చాలా ప్రోబ్లమ్స్ ఉన్నమాట నిజమే కానీ, ప్రాబ్లెమ్ ఏవైనా అందరం కలసి సరిచేద్దాం. ముఖ్యంగా సర్టిఫికెట్స్ లేని వాటర్ ప్లాంట్స్, అలాగే హెూటల్స్ లో కూడా మీరు చెప్పినవిదంగా ప్రాబ్లెమ్ ఉన్నాయని వాటిని కూడా సరిచేద్దామని, డ్రైనేజ్ వల్ల చాలామందికి విషజ్వరాలు వస్తున్నాయని వ్యక్త పదార్థాలు కాలువలో వేయకుండా, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోదించేలా ప్రజలలో అవగాహనా కల్పించాలని తెలియజేశారు. ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర చైర్మన్(అడ్మిన్) మద్దెల. సురేష్ బాబు మాట్లాడుతూ,ప్రజలలో, స్టూడెంట్స్ లలో చైతన్యం తేవడానికి అవర్నెస్ ప్రోగ్రాం పెట్టబోతున్నామని, చాలా షాప్స్లో వెయిట్ తేడా వస్తుందని దానిపై కూడా లీగల్ మెట్రోలజీ అసిస్టెంట్ డైరెక్టర్ తో కలసి నిఘా పెట్టడం జరుగుతుందని,అపరిశుభ్రంగా వున్న హెూటల్స్, సర్టిఫికెట్స్ లేకుండా పీహెచ్ వ్యాల్యూ తెలియకుండా, టీడీఎస్ అంటే తెలియకుండా వాటర్



బాటల్స్ తయారు చేస్తున్నారని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో డిస్ట్రిక్ట్ చైర్మన్ కిషోర్, జనరల్ సెక్రటరీ బద్వేల్ సురేష్ బాబు, వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, కోట. సుబ్బారావు, ఉమామహేశ్వర్ రావ్, డిప్యూటీ చైర్మన్ చైర్మన్ నౌషాద్ బాషా, మీడియా సెక్రటరీ రాధాకృష్ణ, సుబ్బారాయుడు,చలపతి, రమేష్ నాయక్,అన్నమయ్య జిల్లా చైర్మన్ మునీర్,ఈశ్వర్, రాకేష్ వర్మ, పాల్గొన్నారు.

# వాతావరణ కేంద్రం హెచ్చరికతో మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి



**బద్వేల్ మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కడపజిల్లాలో భారీ వర్షాల వస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో బద్వేల్ మున్సిపాలిటీలో పరిధిలో పనిచేసే మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. వాతావరణ కేంద్రం హెచ్చరికతోబద్వేల్ పురపాలక కార్యాలయంలో మునిసిపల్ కమీషనర్ నరసింహ రెడ్డి గురు వారం సిబ్బందితో మున్సిపల్ సభా భవనం కార్యాలయము నందు సమావేశం ఏర్పాటు చేశారు. గత కొద్ది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నప్పటికీ రేపు భారీ వర్షాలు కడప జిల్లాలో కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేయడంతో మున్సిపల్ సిబ్బంది అందరూ ఫీల్డ్ లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సెలవులు మంజూరు చేసిన సిబ్బం దికివారి సెలవులు రద్దు చేయడమైనదని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు వర్షపాతం వల్ల ఎలాంటి ఇబ్బందులు గురి కాకుండా మున్సిపల్ సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి సిబ్బందిని కోరారు.ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, రెవెన్యూ ఆఫీసర్, మేనేజర్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# తక్షణం సహాయక చర్యలు చేపట్టండి

### లోతట్టు ప్రాంతాల పరిశీలనలో

### ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి



**కడప రూరల్ మేజర్‌న్యూస్ :** నగరంలో అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఏ ఎస్ ఆర్ కాలనీ, ఎన్ ఎన్ ఆర్ కాలనీ, ఆచారి కాలనీ పలు లోతట్టు జననివాసాలు జలమయమయ్యాయి. వీధుల్లో మోకాటి లోతు వర్షపు నీరు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి గురువారం నీట మునిగిన ప్రాంతాల ప్రజల ఇబ్బందులు, సమస్యలను ప్రత్యక్షంగా ఆటోలో పరిస్థితిని సమీక్షించి, తక్షణం వర్షపు నీటి సమస్యను పరిష్కరించే దిశగా కాలువల శు భ్రత, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం చేయాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడం, వారి సురక్షిత జీవనానికి చర్యలు తీసుకోవడం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా శాశ్విత చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఏ కష్టం వచ్చినా నేనున్నానని ఆమె ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో లోతట్టు డివిజన్ల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# హాల్ గంగాధర్ రెడ్డి కుటుంబ సభ్యులకు వైకాపా నాయకుల పరామర్శ



**పులివెందుల మేజర్‌న్యూస్ :** కొద్దిరోజుల క్రితం కారు ప్రమాదంలో గాయపడ్డ పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు పరామర్శించారు. వ్యక్తిగత కార్యక్రమాల్లో భాగంగా కడప నుండి పులివెందులకు తిరుగు ప్రయాణంలో గొందిపల్లి వద్ద హాల్ గంగాధర్ రెడ్డి కారు అదుపుతప్పి ప్రమాదానికి గురికాగా కారులో ప్రయాణిస్తున్నటువంటి గంగాధర్ రెడ్డి సోదరుడు గంగిరెడ్డి తదితరులు గాయపడి మెరుగైన చికిత్స అనంతరం డిశ్చార్జ్ కాబడి తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న సతీష్ రెడ్డి గురువారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ చైర్మన్ హాఫీజుల్లా, కౌన్సిల్ ఖాదర్ బాషా తదితరులతో కలిసి గంగాధర్ రెడ్డిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీసి అధైర్యపడవద్దని అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో హాల్ గంగాధర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇతర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### వైకాపా జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** ప్రజల భద్రతే ప్రాధాన్యం రాయలసీమ కడప నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్సీపీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డి.వి. శశికాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉండ టంతో, అక్కడి ప్రజలు తగు జాగ్రత్తలు పాటి ంచాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా ఉంటారని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు, నదులు ఉధృతంగా ప్రవహించే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అవి దాటే ప్రయత్నాలు చేయరాదని హెచ్చరించారు.విద్యుత్ స్తంభాలు, తీగలు దగ్గర పిల్లలు, పెద్దలు వెళ్ళరాదని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడే అవకాశం ఉన్నందున, చిన్నారులు వృద్ధులు ఇళ్లలోనే ఉండాలని సూచించారు.పాత ఇళ్లలో లేదా చెట్ల కింద ఉండకూడదని ప్రజలకు సూచించారు.అధికారులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు చర్యలు తీసుకోవాలి అన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న కాలనీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అత్యవసర సాయం అవసరమైన సందర్భాల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను సంప్రదించవచ్చని తెలిపారు.శానిటేషన్ పనులు వేగంగా చేపట్టాలని, దోమల సమస్యను నివారించేందుకు తగిన చర్యలు తీసుకో వాలని అధికారులకు ఆయన కోరారు.రాబోయే రెండు మూడు రోజులు ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

# పంచాయతీలకు మహర్దశ

### - ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటం అందజేత



**వేంపల్లె మేజర్‌న్యూస్ :** తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనలో పంచాయ తీలకు మహర్దశ పట్టిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డికీ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత పాలనలో పంచాయతీలను పట్టించుకోక గాలికి వదిలేశారన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు కేంద్ర పంచాయతీ రాజ్ వ్యవస్థ నుంచి రాష్ట్ర గ్రామీణ స్థానిక సంస్థలకు రూ 410.76 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. అలాగే స్థానిక పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఇఓ ని కోరామన్నారు. వర్షకాలం నైపథ్యంలో ఎప్పటికప్పుడు మురికి కాల్వల శుభ్రత, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని విన్నవించామన్నారు. అలాగే స్వచ్ఛ భారత్ పై ప్రజల్లో అవగాహన కల్పించి, వేంపల్లె గ్రామ పంచాయతీని ఉత్తమంగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామస్వరాజ్య స్థాపనకు మహాత్మాగాంధీ కళలను సాకారం చేసేందుకు తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు దొంతు సుమన్, నాయకులు శివకృష్ణ, రవి, చంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ జి ఎఫ్ ఐ సెలెక్షన్స్ లో జిల్లా స్థాయి క్రీడలకి శ్రీ మహర్షి హైస్కూల్ విద్యార్థులు




**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలెక్షన్స్ లో మండల స్థాయిలో స్థానం పొంది నియోజకవర్గం స్థాయిలో పాల్గొని అక్కడ నుంచి కబడ్డీ విభాగంలో ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి కి పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ మహర్షి హైస్కూల్ విద్యార్థులు ఎంపిక య్యారు.అండర్ 14 విభాగంలో తరుణి, సుస్మిత, అండర్ 17 విభాగంలో ఖాసీం,సుహాసిని మరియు శ్వేత విద్యార్థులు వారి ప్రతిభని కనబరిచి జిల్లా స్థాయిలో వారి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. శ్రీ మహర్షి హై స్కూల్ కరె స్పాండంట్ గురుమోహన్ మరియు భాస్కర్ లు వారిని అభి నందించి, వారు జాతీయ స్థాయిలో ఆడాలని ఆకాంక్షించారు. అలాగే పిఈటి లు షరీఫ్ మరియు శైలజ లను అభినందించారు. వారిని జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. వారు జాతీయ స్థాయికి వెళ్ళా లని కోరుకుంటూ వారికీ ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తామని ప్రోత్సహించారు.

# రితీష్ రెడ్డి చొరవతో అక్కివారిపల్లి చెరువుకు మరమ్మతులు



**కలసపాడు మేజర్‌న్యూస్ :** రైతులు అడిగిన వెంటనే అక్కివారిపల్లి చెరువుకు సగిలేరు ద్వారా నీటిని నింపేందుకు అధికారులను ఆదే శించిన రితీష్ రెడ్డికి కలసపాడు ఎగువ సాగిలేరు నీటిసంఘం అధ్యక్షుడు కొత్తపల్లి చిన్నారంగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు అక్కివారిపల్లి చెరువు తూములకు మరమ్మతులు చేయడం , సగిలేరు కెనాల్ నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. 5 సంవత్స రాలనుండి చెరువు నీరు లేకపోయినా గతంలో అధికారులు స్పందించక పోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెరువు నిండ టంతో ఆయకట్టు రైతులు వ్యవసానికి సన్నద్ధమవుతున్నారని కలసపాడు ఆయకట్టు టీ.సి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుగంగ ఈ ఈ మల్లి కార్జున , ఏయ్ సృజన, లష్కర్ నాగన్న, గుడిమె వెంగయ్య పర్యవేక్షించారు.

## ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో వర్షపు నీరు

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ఉద్యోగస్తులు



**ఖాజీపేట మేజర్‌న్యూస్ :** ఇటీవల కురిసిన అకాల వర్షాల ప్రభావంతో ఖాజీపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు చెరువుల్లా మారిపోయాయి. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, ఖాజీపేట-2 సచివాలయం ఆవరణల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రతి రోజు తమ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు నీటిలో నడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు జారి పడే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షం కురిసిన ప్రతీసారి ఇదే దృశ్యం పునరావృతం అవుతుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వ కార్యాలయాలకు పలు పనుల కోసం వచ్చే ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

## నేడు చింతకొమ్మ దిన్నెలో ఎమ్మెల్యే చైతన్య రెడ్డి పర్యటన బుగ్గ వంక నీటి విడుదల కార్యక్రమం.

**చింతకొమ్మ దిన్నె మేజర్‌న్యూస్ :** కమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు పుత్తా చైతన్య రెడ్డి నేడు చింతకొమ్మ దిన్నె మండల పర్యటనలో పాల్గొననున్నారు.సాయంత్రం 3 గంటలకు చింతకొమ్మ దిన్నె మండలం బుగ్గ వంక కట్ట వద్ద ఉన్న శివాలయం సమీపంలో జరిగే నీటి విడుదల కార్యక్రమానికి ఆయన విచ్చేస్తున్నారు.ఈ సందర్భంగా బుగ్గ వంక కుడి కాలువ ద్వారా రెడ్డి చెరువుకు, అలాగే ఎడమ కాలువ ద్వారా ఇప్పెంట, నక్కలకుంట, చింతకొమ్మ దిన్నె చెరువులకు నీటి విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చైతన్య రెడ్డి ప్రారంభించనున్నారు.కావున మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అలాగే ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులుఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగాసహకార బ్యాంక్ చైర్మన్ గంధం మోహన్ బాబు తెలిపారు.

## సైబర్ నేరాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

### అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె రమణారెడ్డి



**మైదుకూరు మేజర్‌న్యూస్ :** మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సైబర్ నేరాలు మరియు ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు గురువారం మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. రమణారెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ ద్వారా వచ్చే ఫోన్ కాల్స్, లోన్ యాప్ లు, ఉద్యోగ యాప్ లు క్లిక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించా రు. మీ చదువు మరియు ఉద్యోగాలకి సంబంధించిన విషయాలకు మాత్రమే నెట్ ను ఉపయోగించాలని. సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అవసరమైన రీతిలో అవసరమైనంత మాత్రమే ఉపయోగిస్తూ, చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆహార పదార్థాలలో ఉప్పును ఎలా ఉపయోగిస్తామో అలా ఉపయోగించుకుంటే సైబర్ నేరాలను చాలావరకు అధిగమించవచ్చునని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన వారిని, మేమున్నామంటూ సాదరంగా అందరూ ధైర్యం చెప్పి ఆదరించాలన్నారు. మన చుట్టూ రోజు రోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాలు అంటే లోన్ యాప్ ల ద్వారా డబ్బులు పోగొట్టుకోవటం, మెసేజ్ లేదా లింక్ ను క్లిక్ చేయడం ద్వారా చాలామంది తమ ఖాతాలో నుండి డబ్బులను పోగొట్టుకుంటున్నారన్నారు. విద్యార్థులుగా మీరు అవగాహన పొంది మీ చుట్టూ మరియు మీ కుటుంబ సభ్యులకు వాటిపై అవగాహన కల్పించటం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. పోలీస్ టీం పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ కమిటీ- అభివృది కి కృషి

### అభివృద్ధి సమస్యలపై చైర్మన్ల సమావేశం



**కమలాపురం మేజర్‌న్యూస్ :** కడప జిల్లా పరిధిలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు సమావేశం కమలాపురం మార్కెట్ యార్డ్ నందు మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లా మార్కెట్ యార్డ్ గౌరవ అధ్యక్షులు పుత్త కృష్ణ చైతన్య రెడ్డి సహకారంతో జిల్లాలోని మార్కెట్ యార్డ్ చైర్మన్ ల సమస్యలు మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై చర్చించుకున్నామన్నారు మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీల అభివృద్ధి, యార్డుల అభివృద్ధి కార్యక్రమాలు, పాలకవర్గాల ప్రస్తుత సమస్యలు, అలాగే రైతుల సంక్షేమం మరియు రైతులకు అందిస్తున్న మద్దతు ధరల అమలు విధానాలపై విస్తృతంగా చర్చ జరిగిందనారు మార్కెట్ యార్డులలో ఆదాయాన్ని ఎలా పెంపొందించుకోవాలన్న విషయంపై కూడా చర్చించామన్నారు రైతు సేవలకే మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేశారని రైతులకు కావలసిన అన్ని వసతులు మార్కెట్ యార్డులో కల్పించేందుకు సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నామన్నారు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చైర్మన్ లేక బాధ్యతను నిర్వహిస్తామన్నారు రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు మార్కెట్ యార్లలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు అందుకు అవసరమైన గౌడ నిర్మాణానికి కూడా కృషి చేస్తున్నామన్నారు రైతులు కూడా ఏవైనా సమస్యలు ఉంటే డైరెక్ట్ గా మార్కెట్ యార్డ్ చైర్మన్ తో చర్చించి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు రైతులకు ఎలాంటి వసతులు కావాలనో అన్ని సమకూర్చేందుకు మార్కెట్ యార్డులను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు కొన్ని మార్కెట్ యార్లలో వారాంతపు సొంత జరుగుతూ ఉంటుందని అందులో పశువులు వస్తువులు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారని వాటికి ఆదాయం ఎక్కువగా వస్తుందని అలాగే మిగతా మార్కెట్ యాల్లో కూడా సంతలు జరిగే విధంగా కృషి చేస్తామన్నారు ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటి, యర్రగుంట్ల అధ్యక్షులు ఆర్. నాగరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటి జమ్మమడుగు, అధ్యక్షులు యస్. నాగేశ్వరరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి, మైదుకూరు, ఏ.పి. రవీంద్రా, వ్యవసాయ మార్కెట్ కమిటి, బద్వేలు, ఎన్. సుప్రజ, వ్యవసాయ మార్కెట్ కమిటి,పులివెందుల జి. అమర్ నాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటి, సింహాద్రిపురం బి.రామసూరారెడ్డి,మరియు వ్యవసాయ మార్కెట్ కమిటి, ప్రొద్దుటూరు అధ్యక్షులు, వద్ది సురేఖ లు పాల్గొన్నారు.

## స్త్రీ నిధి పోస్టర్ ఆవిష్కరించిన జేసీ అదితి సింగ్



**కడప ప్రతినిధి - మేజర్‌న్యూస్ :** స్త్రీ నిధి రుణాల మంజూరు, చెల్లింపును నెలవారీ వాయిదాల మొత్తం వివరాలను వివరించే పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఆవిష్కరించారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు పూర్తి అవగాహన కల్పించు క్రమంలో ఈ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు వీణా వేంకటేశ్వర ప్రసాద్, స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులలో అవగాహన పెంచడానికి స్త్రీ నిధి రుణ మంజూరు మరియు చెల్లింపులకు సంబంధించిన ముఖ్య అంశాలను చర్చించడం జరిగింది.

## కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

### ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం దారుణం....వైయస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి




**పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** పెండ్లిమర్రి మండల వైయస్సార్సీపి కార్యకర్తలతో గురువారం నాడు కడప పార్టీ ఆఫీసులో ఆ పార్టీ కమలాపురం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చింతకొమ్మదిన్నె జడ్పిటిసి నరేన్ రామానుజుల రెడ్డి మాట్లాడుతూ,, ప్రభుత్వమెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణకు పూనుకొని కూటమి ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అప్ప చెప్పటం దారుణమని, విద్యార్థుల భవిష్యత్తును కాలరాయటమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని పేర్కొంటూ ఈ విషయంపై ప్రజల నిరసనను కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.... ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ, జడ్పిటిసి, ఎం.పీ.టీ.సీ.లు వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కుట్రలు తిప్పికొట్టే విధంగా సంతకాల సేకరణ

### స్వచ్ఛందంగా ప్రజలతో సంతకాల సేకరించండి ఎంపీ అవినాష్ రెడ్డి





**పులివెందుల మేజర్‌న్యూస్ :** మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డిఆదేశాల మేరకు గురువారం పులివెందుల పట్టణంలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు నాయకులు కార్యకర్తల సమావేశానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి,వైయస్ మదనమోహన్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిమాట్లాడుతూ,పులివెందుల నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఇంటి వద్దకు వెళ్లి ప్రజలతో స్వచ్ఛందంగా సంతకాలు పెట్టించుకోవాలన్నారు. ప్రజల స్వచ్ఛందంగా సంతకాలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయామని ప్రజలలో తిరుగుబాటు మొదలైంది అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సంతకాలు చేస్తే లక్ష పైన సంతకాలు అవుతాయన్నారు. మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చ డంలో విఫలమైందన్నారు. అంతకుముందుగా దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు కార్యకర్తలు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఘనంగా స్పటిక లింగ చర ప్రతిష్ఠా మహోత్సవం



ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్: స్థానిక మెయిన్ బజార్ లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో స్పటిక లింగ చర ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేకువ జామున గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, యంత్రార్చన, 121 కలశాల పూజా ద్రవ్యాలతో అభిషేకం, గణపతి, నవ గ్రహ, రుద్ర హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అదేవిధంగా ఆలయ మూలవిరాట్టు వాసవీ మాతకు ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్ రావు మాట్లాడుతూ పూణే నుండి తీసుకుని వచ్చిన స్పటిక లింగానికి కార్తీక మాసం అంతా భక్తులు అభిషేకం చేసే వీలు కల్పించామని వివరించారు. ఉదయం 11 గంటల వరకు అభిషేకాలు నిర్వహించి, సాయంత్రం గర్భగుడిలో భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యం

## గుణగణపల్లెలో గ్రామ సభల ద్వారా సీఐ ఎన్.వి.రమణ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన

లింగాల, మేజర్‌న్యూస్: లింగాల మండలంలోని గుణగణపల్లె గ్రామంలో పులివెందుల రూరల్ సిఐ ఎన్‌వి, రమణ ఆధ్వర్యంలో లింగాల ఎస్సై అనిల్ కుమార్,పోలీస్ అధికారులు, సిబ్బంది పర్యటించి గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎన్ వి రమణ మాట్లాడుతూ ఎస్పీగా షెల్కే నచికేత్ విశ్వనాథ్, పులివెందుల,డి.ఎస్.పి మురళి నాయక్, ఉత్తర్వుల మేరకు గురువారం సాయంత్రం గ్రామ ప్రజలందరూ ఇంటి వద్ద ఉంటారు కావున ఈ గ్రామ సభలు నిర్వహించామని ఆయన అన్నారు. ఈ గ్రామ సభలు నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు అలాంటి నేరాలలో మీరు చిక్కుకుంటే మీపై ఎలక్షన్ల సమయంలో బైండోవర్ కేసులు నమోదు చేసి ప్రతి ఎలక్షన్లకు మిమ్మల్ని, మీ పిల్లలు ఎక్కడ జాబు చేస్తున్న వారిని కూడా పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తారు. మీరు కాకుండా మీ పిల్లల భవిష్యత్తు కూడా చాలా ఇబ్బంది పెట్టే వారు అవుతారని ఇది గమనించి మీరు ఎలాంటి కక్షలో గొడవలకు వెళ్ళవద్దని ఆయన ఆ గ్రామ ప్రజలకు వివరించారు. అందుకే ప్రజల భద్రతే ముఖ్యం అంటూ పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఆయన ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. అలాగే మహిళలు బాలికలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు సైబర్ మోసాలు, పోక్సో కేసులు ,నూతన చట్టాలు పై గ్రామసభల ద్వారా ఆ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, మరియు ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మోసం జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే డైల్ 1930 కు కాల్ చేయాలని ఆయన ఆ గ్రామ ప్రజలకు వివరించారు. వాహనదారులకు ముఖ్య సూచనలు చేశారు. సాయంత్రం వేళ వాహనాలు తనిఖీలు తనిఖీలు నిర్వహిస్తే కొంతమంది అబ్బా పోలీసులు ఉన్నారు మనం ఎలా వెళ్లాలి అని చాలామంది అనుకుంటుంటారు. ఇవి చేపట్టేది మీకోసమేనని సీఐ ఎన్.వి రమణ అన్నారు. ఎలా అనగా ఈ తనిఖీలు చేపట్టడంతో వాహనదారులు ప్రతి ఒక్కరూ వారి వారి వెహికల్ డాక్యుమెంట్స్, లైసెన్సు తోపాటు,రోడ్డు ప్రమాదాల నివారణకు గురికాకుండా అలానే ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం వల్ల కొంతవరకు ప్రమాదాలు తగ్గుతాయన్నారు. ఎస్సై అనిల్ కుమార్



మాట్లాడుతూ ఆపద సమయంలో తక్షణ సహాయం కోసం డైల్ 100, 112 నంబర్లను ఉపయోగించుకోవాలని ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు వెళ్లకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని ఎస్సై అనిల్‌కుమార్ సూచించారు. ఏ సమస్యలు ఉన్న పోలీసులు దృష్టికి తీసుకురావాలని ఆ గ్రామ ప్రజలకు తెలియజేశారు. అలాగే గత కొద్ది రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని పాత ఇల్లు మట్టి మిద్దెలలో ఉన్న ప్రజలు తక్షణమే అలాంటి ఇళ్ళలో ఉండకుండా సురక్షితమైన ఇండ్లలో ఉండాలని ఎస్సై అనిల్ కుమార్ తెలియజేశారు. అలాగే రైతులు తోటల వద్ద కరెంటు తీగలు, మరియు కరెంటు పోల్లు వాటి వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా కరెంటు సమస్య వస్తే కరెంటు ఏఈ రమేష్, లేదా కరెంటు సబ్ స్టేషన్ వారిని గాని సంప్రదించాలని ఆయన అన్నారు. అలాగే ఎక్కడైనా వాగులు వంకలు దాటుకునేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు ఆయన తెలిపారు. ఏదైనా పోలీసు సహాయార్థం 9121100551, 9121100549, 9121100545, 112/100కు ఫోన్ చేయవచ్చని ఆయన గ్రామ మరియు మండల ప్రజలకు వివరించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షణ

## సమస్యలపై పరిష్కారాని చొరవ



వేంపల్లె, మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని జనసేన ఇంఛార్జ్ డా.హరీష్ గురువారం పర్యవేక్షించారు. ఆపరేషన్ థియేటర్ లో ఎలక్ట్రికల్ సమస్య ఉందని, ఆపరేషన్లు చేయలేక పోతున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సుభాషిణి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డిని తెలియజేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. అలాగే ఎక్స్ రే మిషన్ ఉన్నప్పటికీ టెక్నిషన్ లేనందున ఉపయోగం లేకుండా పోతుందని, వీటి కోసం టెక్నిషన్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మల్లికార్జున, జనసేన నాయకులు శ్యామ్, దేవా, జయచంద్ర, లక్ష్మణ్, బిజెపి జిల్లా నాయకుడు దొంతు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

## మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలత




చాపాడు మేజర్‌న్యూస్ : రైతులకు అవసరమైన యూరియాను ఫర్టిలైజర్ షాపుల యజమానులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారిని దేవీ పద్మలత హెచ్చరించారు. గురువారం చాపాడు మండలంలోని ఫర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేశారు. ప్రైవేట్ దుకాణాల వద్ద యూరియా పంపిణీని పర్యవేక్షించడం జరిగింది. అక్కడ ఉన్న రైతులతో కూడా సంభాషించడం జరిగింది. అనంతరం ఏవో మాట్లాడుతూ మండల రైతులకు సరిపోయే యూరియాను అందుబాటులో ఉంచామని ఎవరైనా డీలర్లు కృత్తిమ కొరత సృష్టించిన అధిక ధరలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డీలర్లు విధిగా స్టాక్ బోర్డులను అప్డేట్ చేయాలని ఆదేశించారు.రైతులు వారి అవసరం మేరకు ఎరువులు తీసుకోవాలని కోరారు. యూరియాను అధికంగా వాడటం వల్ల పంటలకు చీడపీడలు ఆశించి దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. సాధారణ యూరియాతో పోలిస్తే నత్రజని వినియోగ సామర్థ్యం నానో యూరియాలో ఎక్కువగా ఉంటుందని నానో యూరియాను ఇతర పురుగుమందులతో కూడా కలిపి పిచికారి చేసుకోవడం వల్ల రైతులకు శ్రమ డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. డిబిటీ గ్రౌండ్ స్టాక్ తేడా ఉన్న ఎరువులు సరిచేసుకునేంత వరకు స్టాప్ సేల్స్ ఇవ్వడం జరిగింది.

# రైతులకు సబ్సిడీ ద్వారా బుడ్డ శెనగలు పంపిణీ చేయాలి

## వైఎస్ఆర్సీపీ కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డి, వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకటనారాయణ

వేముల, మేజర్‌న్యూస్: వేముల మండలం లోని రైతులకు సబ్సిడీ ద్వారా బుడ్డ శెనగలు పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని వైఎస్ఆర్సీపీ వేముల మండల కన్వీనర్ నాగెళ్ళ సాంబశివరెడ్డి,వేముల ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ అన్నారు.గురువారం ఉదయం వేముల మండలంలోని స్థానిక వేముల గ్రామంలో ఉన్నటువంటి మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో కలసి రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేసి ప్రభుత్వం ఆదుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఓబులేష్ కి వినతి పత్రాన్ని రైతులతో కలిసి వైసీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి ,ఎంపీపీ చల్లా గంగాదేవి వెంకట నారాయణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు అవుతున్న ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా శనగ విత్తనాలను పంపిణీ చేయలేదన్నారు. ఈ సీజన్ లో వేముల మండలం లో వేల ఎకరాల లో రైతులు బుడ్డ శనగ పంటను విస్తారంగా సాగు చేస్తారని,అదును దాటుతున్నా ప్రభుత్వం సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేయలేదన్నారు. సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అదును దాటిన తర్వాత విత్తనాలు పంపిణీ చేస్తే ఉపయోగం ఉండదన్నారు. ఇప్పటికే రైతులు బయట మార్కెట్లో శనగ విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చుకున్నారన్నారు. రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేయాలని వైసీపీ తరపున కోరుతున్నామన్నారు.గత 35 సంవత్సరాల నుంచి సబ్సిడీ ద్వారా బుడ్డ శనగలు పంపిణీ చేస్తున్నారు అని కానీ ఈ ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసింది అని అన్నారు.ఇప్పుడు అయిన అధికారులు చొరవ తీసుకుని రైతులకు సబ్సిడీ ద్వారా బుడ్డ శనగలు పంపిణీ చేయాలని అన్నారు అలా చేయని పక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చందామల్ రెడ్డి, కోఆప్షన్ నెంబర్ మండి



మాఫీరా,సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, నాగప్ప, బొజ్జ శివశంకర్ రెడ్డి,పేర్ల రామ సుబ్బారెడ్డి, బస్సు సుబ్బారెడ్డి, యువ నాయకులు రామిరెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి కడప జిల్లా యువజన విభాగం కార్యనిర్వహక సభ్యులు చల్లా సునీల్ కుమార్, చాగలేరు మాజీ ఎంపీటీసీ జయరాం రెడ్డి, గంగయ్య, కార్యదర్శి కొవ్వూరు గంగాధర, గౌస్ పీర్, నారాయణస్వామి, వైఎస్ఆర్సిపి దివ్యాంగుల అధ్యక్షులు చాగలేటి భాస్కర్, వేముల వైస్ ప్రెసిడెంట్ జెర్మియా, జగదీశ్వర్ రెడ్డి రైతులు,ప్రజలు పాల్గొన్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
గత 19 సంవత్సరాలుగా దిగ్విజయంగా నడుపబడుతున్న
నేటి దినపత్రిక సూర్యకు
విలేకరులు కావలెను.
కడప జిల్లా : జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, కొండాపురం, తొండూరు, చక్రాయపేట, వి.ఎన్.పల్లి, గోపవరం
సంప్రదించాల్సిన నెంబర్లు :
9985763242, 8885763242,

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు ద్రోహం

## మెడికల్ కాలేజీల పట్ల కూటమి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి మానుకోవాలి

## వైఎస్ఆర్సీపీ కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి





**చెన్నూరు మేజర్‌న్యూస్ :** మెడికల్ కాలేజీలను ప్రైవేటు రంగానికి అప్పగించడం పేద విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని వైఎస్ఆర్సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మండలంలోని ఓబులంపల్లె గ్రామపంచాయతీలో గురువారం సాయంత్రం వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమలాపురం నియోజవర్గ ఇంచార్జి నరేన్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించేందుకు 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూపకల్పన చేసి రూ. 8,480 కోట్లను కేటాయించారని తెలిపారు. అందులో ఐదు కాలేజీలు పూర్తికాగా మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఐదు కాలేజీల్లో 750 ఎంబీబీఎస్ సీట్లు కల్పించడం వైసీపీ ప్రభుత్వ సంకల్పబలం అని వివరించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలకు జాతీయ వైద్య మండలి ఇచ్చిన సీట్లను కూడా నిర్వహించలేమని కేంద్రానికి లేఖ రాయడం దారుణమని విమర్శించారు. పేద విద్యార్థుల పట్ల ద్వంద్వ వైఖరి మానుకుని ప్రజల ప్రయోజనాలను కాపాడాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్సీపీ నాయకులు మాసీమ బాబు, చీర్ల సురేష్ యాదవ్, అన్వర్ భాష తదితరులు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రజలకు మేలు చేసే ఈ కార్యక్రమాలను కొనసాగించాల్సిన కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ పేరుతో అడ్డుకుంటోందని విమర్శించారు. వైద్య విద్యను "ఫ్యాషన్"గా అభివర్ణించడం తెలుగుదేశం పార్టీ నాయకుల నిర్లక్ష్య ధోరణి అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబు, మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, సర్పంచ్ చల్లా ప్రమీల, వైఎస్ఆర్సీపీ నాయకులు చల్లా వెంకటసుబ్బారెడ్డి, చల్లా శివారెడ్డి, పట్టాభిరామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గంగాధర్, మైనార్టీ నాయకులు అన్వర్ భాష, వారిష్, హస్రత్, జుమన్, సత్యరాజు, నిత్యపూజయ్య, నారాయణ రెడ్డి, చంద్ర యాదవ్ పాల్గొన్నారు.

# గ్యార్మి పండుగ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల పట్టణం లోని శ్రీ శ్రీ శ్రీ గంజే సాహెబ్ బాబా దర్గా నందు గ్యార్మీ పండుగ సందర్భముగా మహబూబ్ సుభాని దర్గాకు జెండాలు సమర్పించి, ప్రత్యేక పూజా మరియు అన్నదాన కార్యక్రమాలలో బద్వేల్ నియోజకవర్గ వైయస్సార్సీపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చేతికి వచ్చిన పంట వర్షం పాలు



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మండలంలోని దమ్మన పల్లె గ్రామంలో అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చేతికి వచ్చిన వరి పంట నేలపాలు అయిందని రైతులు తోట ప్రసాద్, తోట ఎర్రయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. కోత దశలో ఉన్న పంట నేల పాలు కావడం బాధాకరంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టామని వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

# కడప సువార్త పండుగలు పోస్టర్ ఆవిష్కరణ...

## పోస్టర్ ఆవిష్కరించిన క్రిస్టియన్ అసోసియేషన్స్. మీటింగ్స్ కన్వీనర్ బ్రదర్ జోయల్ గణేష్



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో కడప నగరంలో ఉన్న ఆల్ క్రిస్టియన్ అసోసియేషన్ లీడర్స్ మరియు పాస్టర్లు గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ వారు ముందుగా కడప సువార్త పండుగ ల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మీటింగ్స్ కన్వీనర్ బ్రదర్ గణేష్ మాట్లాడుతూ. నవంబర్ మాసం 11,12,13 తేదీలలో సువార్త పండుగలు సభలు కడప సి ఎస్ ఐ గ్రౌండ్లో జరుగునని ముఖ్య ప్రసంగికులుగా రాజమండ్రి నుంచి విచ్చేయుచున్న అంతర్జాతీయ దైవజనులు జాన్ వెస్లీ సిస్టర్ శ్రీమతి బ్లేస్సి వెస్లీ వీరు విచ్చేయుచున్నారు. రోగుల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేయుదురు చక్కటి సంగీత ఉజ్జీవ ఆత్మీయ పాటలు ఉండును. ప్రతి ఒక్కరు ఈ మీటింగ్ కు హాజరై పాల్గొని దైవ ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ మినిస్ట్రీస్ కడప కోఆర్డినేటర్ ఎన్ . విజయబాబు, శ్యామ్, బబ్లు మరియు నగరంలో ఉన్న అసోసియేషన్ లీడర్లు. పాస్టర్లు. సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లీడర్లు మల్లెం విజయభాస్కర్, విజయ్ కిషోర్ పాస్టర్ జాన్ . బిషప్ డేనియల్ కృష్ణ దాసు . బాబురావు కె డేవిడ్ రాజు. విజయ్ శేఖర్. దైవజనురాలు విజయమ్మ స్పర్జన్. పుల్లూరు శ్రీనివాస్ లు. దేవ భూషణం. అబ్రహం. అమర్. జాన్సన్.. రవి. సిస్టర్ భారతి సిస్టర్ అమ్ములు. మోసే. రాజశేఖర్. ఆనందు. వినోదు. అజరయ్య దేవరాజు. వరికొండు జార్జి మద్దెల దిలీప్ ఎర్రగుంట్ల పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చర్యలు ఎక్కడ?

## ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి సుశాంత్ ని రక్త గాయాలు అయ్యేలా ప్లాస్టిక్ పైపుతో కొట్టిన తెలుగు ఉపాధ్యాయుడు నారాయణస్వామి ని చర్యలు ఎక్కడ? అని గురువారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులను చేయాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థులను రక్తం వచ్చేలాగా కొట్టడం చాలా దారుణం అని వారు అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నడవడికలు నేర్పే ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ రాక్షసులుగా ప్రవర్తిస్తున్న సంఘటనలు జిల్లాలో రోజు రోజుకు అధికమవుతున్నాయి అని వారు అన్నారు. విద్యార్థులపై దాడి చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలల్సిన జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ జరుగుతున్నాయన్నారు. విద్యార్థిని రక్త గాయాలు అయ్యేలా కొట్టిన ఉపాధ్యాయుడిపై విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తే ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి విద్యార్థి పక్షాన నిలబడి విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన నాయకులపై పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, తోటి ఉపాధ్యాయులు వీర నారాయణ, ప్రభాకర్, విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడు నారాయణ స్వామి లు పోలీసు కేసు పెట్టడం సిగ్గు చేటు అన్నారు. సభ్యసమాజం తల దించుకొనేలా ప్రవర్తించి విద్యార్థిపై దాడి చేసిన ఉపాధ్యాయుడిని అందుకు సహకరించిన తోటి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకొని వారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని వారు హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మోహన్, జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ పాల్గొన్నారు.

# నూతన ఉపాధ్యాయులకు ఐడీలు కేటాయించండి -యుటిఎఫ్



**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** మెగా డీఎస్సీ ద్వారా జిల్లాలో ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు వెంటనే ట్రెజరీ ఐడీలు కేటాయించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం సాయంత్రం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉపసంచాలకులు యమ్ యస్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా నూతనంగా ఉమ్మడి కడప జిల్లాలో 672 మంది ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని వారికి ట్రెజరీ ఐడి లు కేటాయించడంలో ఆలస్యం కావడం వలన జీతాలు పొందడానికి ఆలస్యమవుతున్నదని తెలిపారు. ఖజానా కార్యాలయం నుండి వేగవంతంగా ట్రెజరీ ఐడీలను కేటాయిం చవలసిందిగా యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన కోరడం జరిగింది. ఉప ఖజానా శాఖ అధికారి వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ డీఈఓ కార్యాలయం నుండి ఎంపిక కాబడిన ఉపాధ్యాయుల జాబితా ఇంకా చేరలేదని చేరిన వెంటనే సబ్ ట్రెజరీ లకు సమాచారం అందజేసి వేగవంతంగా ఐడీలు కేటాయిస్తామని తెలిపారు

# రంపతాడులో వైవియు ఎన్ఎస్ఎస్ యూనిట్-5 స్వచ్ భారత్




**పెండ్లిమర్రి, వై.వి.యూ. మేజర్‌న్యూస్:** వై.వీ.యూ. విద్యార్థుల సేవలు గుర్తుంచుకుంటామని రంపతాడు పంచాయితీ సర్పంచ్ సంజీవ రాయుడు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రంపతాడు పంచాయతీ ఎగువ పల్లిలో స్థానిక సర్పంచ్ సంజీవ రాయుడు ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ ఎం.అనితతో కలిసి వారంరోజుల ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. వైవియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల యూనిట్ -5 ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ ఎం.అనిత ఆధ్వర్యంలో ఎగువ పల్లె ఉన్నత పాఠశాలలో తొలిరోజు స్వచ్ఛ భారత కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పరిసరాలలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆచార్య అనిత మాట్లాడుతూ వారం రోజుల కార్యక్రమంలో ప్లాస్టిక్ రహిత సమాజం, చెట్ల పెంపకం, ఓటర్ల అవగాహన, బేటీ బచావో బేటీ పఢావో, న్యూట్రిషన్ ప్రోగ్రాం, సమగ్ర శిశు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంగా, ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ ఎం. అనిత గారి మార్గదర్శకత్వంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-5 ఎగువపల్లె జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో, అలాగే పాఠశాల వెలుపల కూడా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ఏడాది 7 రోజుల ఎన్ ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం కోసం ఎగువ పల్లె గ్రామం, రంపతాడు పంచాయతీని ఎంపిక చేశారు. గ్రామస్థులు, సర్పంచ్ సంజీవ రాయుడు, విండ్ ఇంజినీర్ వెంకట్, టీచర్ సుబ్బారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట రామిరెడ్డి, అకడమిక్ కన్సల్టెంట్స్ డా. రవి, డా. ఆజనీ మరియు వైవీయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా, ఆనందంగా పాల్గొన్నారు. వైవీయూ ఎకనామిక్స్, బయో కెమిస్ట్రీ విద్యార్థులు, వాలంటీర్లు కలిసి వారం రోజులు గ్రామంలో సేవలు అందిస్తారన్నారు..

# విద్యుత్ బకాయిలు చెల్లించండి విద్యుత్ సంస్థకు తోడ్పడండి

### విద్యుత్ శాఖ ఏఈ రాజ్ కుమార్

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఎస్సీ ఎస్టీ విద్యుత్ బకాయిలు ఉన్న వారు విద్యుత్ సంస్థకు బకాయిలు చెల్లించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ రాజ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలంలోని దాసరిపల్లి ఎస్సీ, ఎస్టీ కాలనీలో నేడు శుక్రవారం ఉదయం 10గంటలకు, యన్.ఎర్రబల్లె ఎస్సీ కాలనీ, 12గంటలకు నేలటూరు ఎస్సి కాలనీ విద్యుత్ ఛార్జీల వసూలు కొరకు, మండల స్థాయి సిబ్బంది హాజరు అవుతూ ఉన్నారు. ఈ కాలనీలలో విద్యుత్ డిపార్ట్మెంట్‌కు నిబంధనల ప్రకారము చెల్లించవలసిన ఛార్జీలు చాలా కాలం క్రితం నుండి చెల్లించకుండా ఉన్నందున లక్షల రూపాయలు బకాయిలు ఉన్నాయి. అన్ని ఎస్సి /ఎస్టీ కాలనీల ప్రజలకు ప్రభుత్వము వారు కల్పించిన ఉచిత విద్యుత్ అనే సౌలభ్యం ఖచ్చితంగా అమలుపరుస్తూ ఉన్నాము. నిబంధనలు దాటి విద్యుత్ వాడిన వారి నుండి వసూలు చేసే బాధ్యత మా సిబ్బంది మీద ఉంటుంది. కనుక ప్రజలు ,నాయకులు గమనించి , సహకరించి బకాయిలు వెంటనే చెల్లించాలి అని ఏఈ తెలిపారు.


# అక్షరాస్యత, రోడ్డు బద్రతలపై అవగాహన




**వేంపల్లె, మేజర్‌న్యూస్:** అక్షరాస్యత, రోడ్డు బద్రత లపై అవగాహన కార్యక్రమాన్ని ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఏడు రోజుల పాటు జరిగే ప్రత్యేక శిబిరాల ద్వారా ప్రజల్లో సామాజిక సేవ, ఆయా అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.జె.దీప్తి అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్ నాయక్ పాల్గొని రోడ్డు బద్రత లపై తగిన జాగ్రత్తల గురించి వివరించారు. సామాజిక బాధ్యతని ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ ని ఖచ్చితంగా పాటించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై విజయభాస్కర్ రెడ్డి, ఎన్ఎస్-ఎస్ అధికారులు డా.తిరుపతి రెడ్డి,సుబ్బరాయుడు, గోవర్ధన్ పాల్గొన్నారు.

# కులమతాలకతీతంగా కూటమి ప్రభుత్వం సేవలందించాలి

### హత్యలను కూడా కులాల వారీగా విభజించి ప్రయోజనాల అందించడం సరికాదు
### ముఖ్యమంత్రికి రిజర్వేషన్ పరిరక్షణ సమితి కడప జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ విజ్ఞప్తి



పులివెందుల మేజర్‌న్యూస్: రాష్ట్రములో కులమతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం సేవలందించాలని, హత్యలను కూడా కులాల వారిగా విభజించి ప్రయోజనాలందించడం సరికాదని రిజర్వేషన్ పరిరక్షణ సమితి కడప జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కల్పించి ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వాని దేనని, అది ఎవరు అధికారంలో ఉన్న చేయవలసిన బాధ్యత అని కానీ జరుగుతున్న, జరిగిన రాజకీయ హత్యలు కావచ్చు, ఫ్యాక్షన్ హత్యలు కావచ్చు, వ్యక్తి గత గొడవ కావచ్చు ఇతర సమస్యల వలన కావచ్చు ఇప్పటి వరకు రాష్ట్రములో అనేక మంది హత్యల వలన ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబం రోడ్డున పడ్డాయని ఇది ఒక రకంగా చుస్తే ప్రభుత్వం శాంతి భద్రతల పై చూపించే శ్రద్ధ అర్థమవుతుందని,ఇలాంటి హత్యలు ఎక్కువగా దళితుల, బలహీన వర్గాల.,గిరిజన, మైనారిటీ కుటుంబంకు చెందిన వారు ఉన్నారని అదేవిదంగా అధికార, ప్రతిపక్ష పార్టీ ల అధినేతల కులాలకు చెందిన వారు కూడా ఉన్నారని, కానీ ప్రజలను కులాలకు, మతాలకు అతీతంగా చూడ వలసిన పాలకులు చావును కూడా కులాల వారీగా చూడడం, స్పందన కూడా కులాల వారీగా చూసి స్పందించడము, ఇచ్చే నష్ట పరిహారం కూడా కులాల వారీగా చూసి ఇవ్వడం అనేది చాలా బాధాకరం, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన చేయడమేనని ప్రజాస్వామ్యంకే అవమానకరంగా భావిస్తున్నామని, అందుకే ముఖ్యమంత్రికి రిజర్వేషన్ల పరిరక్షణ సమితి కడప జిల్లా అధ్యక్షుడు డి ప్రశాంత్ డిమాండ్ చేయడం ఏమిటంటే ప్రభుత్వం లక్ష్మీ నాయుడు కుటుంబంకు ఏవిధమైన సహాయం సహకారం అందించారో ఇప్పటి వరకు రాష్ట్రము జరిగిన ప్రతి హత్యకు గురైనా కుటుంబాలకు కూడా ఇదే విధమైన పరిహారం సహాయం అందచేయాలనీ, పోలీస్ అధికారులకు కూడా ఇలాంటి ఆదేశాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రజలను కులాల వారీగా కాకుండా ఆంధ్రప్రదేశ్ పౌరులు గాను, భారత పౌరులు గాను ప్రభుత్వం చూడాలని, పాలన చేస్తున్న ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి గారు కూడా ఆ విదంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

# అయ్యప్ప దీక్షపరులకు ఉచితంగా దీక్ష వస్త్రాలు పూజా సామాగ్రి పంపిణీ

### బలిజ సంఘం అధ్యక్షుడు ధర్మిశెట్టి శ్రీనివాస్ రాయల్



బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్ : క్రీ.శే.ధరిమిశెట్టి వెంకటయ్య కుమారుడు ధర్మిశెట్టి శ్రీనివాస్ (అశోక్) రాయల్ అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయ బలిజ తెలగ కాపు నిత్య అన్నదాన సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాలాధారణ ధరించి స్వాములకు గురువారం స్థానిక బలిజ అన్న సత్రం నందు అయ్యప్ప స్వామి దీక్షకు సంబంధించిన పంచలు, టవాళ్లు,మాలలు, పూజా సామాగ్రి, అయ్యప్ప స్వామి నామాల పుస్తకం, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ తొలివిడతగా 80 మందికి పంపిణీ చేయడం జరిగిం ది రెండో విడతగా 15వ తేదీన మిగిలిన వారికి పంపిణీ చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కొక్కు రవి రాయల్, గురుస్వామి ఆకుల శివకుమార్ స్వామి, పలుగురాళ్లపల్లె గురుస్వామి గురవయ్య స్వామి, మల్లెపల్లె గురుస్వామి డొల్లు రమణయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎస్‌జిఎఫ్ఐ సెలెక్షన్స్‌లో జిల్లా స్థాయి క్రీడలకి శ్రీ మహర్షి హైస్కూల్ విద్యార్థులు




**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెలెక్షన్స్‌లో మండల స్థాయిలో స్థానం పొంది నియోజకవర్గం స్థాయిలో పాల్గొని అక్కడ నుంచి కబడ్డీ విభాగంలో ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయి కి పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ మహర్షి హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్ 14 విభాగంలో తరుణి, సుస్మిత మరియు అండర్ 17 విభాగం లో ఖాసీం,సుహాసిని మరియు శ్వేత విద్యార్థులు వారి ప్రతిభని కనబరిచి జిల్లాస్థాయిలో వారి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. శ్రీ మహర్షి హైస్కూల్ కరెస్పాండంట్ గురుమోహన్ మరియు భాస్కర్‌లు వారిని అభినందించి, వారు జాతీయ స్థాయిలో ఆడాలని ఆకాంక్షించారు. అలాగే పిఈటి లు షరీఫ్ మరియు శైలజ లను అభినందించారు. వారిని జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా శిక్షణ ఇవ్వాలని కోరారు. వారు జాతీయ స్థాయి కి వెళ్ళాలని కోరుకుంటూ వారికీ ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తామని ప్రోత్సహించారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం




బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్: బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్)వాలంటీర్ల ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్ డా. డి.ఎల్ రవీంద్రారెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ ఎస్కే వల్లి నిర్వహణలో ఎన్ఎస్ఎస్ అధికారులు రామకృష్ణ,ఆచార్య ఎన్ వెంకట్రాంరెడ్డి,డాక్టర్ రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్ర శేఖర్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ గురు స్వప్న ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా ఈరోజు జంగంరాజు పల్లె పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలను కంపచట్లను ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ఆ ప్రాంతాన్ని విద్యార్థులు శుభ్రం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో తమ విద్యార్థుల చేత ఏడు రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు అటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కలిగిస్తూ పరిసరాలను శుభ్రపరుస్తూ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బాల సుబ్బయ్య,వీర లక్ష్మి,శారద, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని పరిసరాలను శుభ్రపరిచారు.

# రితీష్ రెడ్డి చొరవతో అక్కివారిపల్లి చెరువుకు మరమ్మతులు



**కలసపాడు, మేజర్‌న్యూస్ :** రైతులు అడిగిన వెంటనే అక్కివారిపల్లి చెరువుకు సగిలేరు ద్వారా నీటిని నింపేందుకు అధికారులను ఆదేశించిన రితీష్ రెడ్డికి కలసపాడు ఎగువసాగిలేరు నీటిసంఘం అధ్యక్షుడు కొత్తపల్లి చిన్నారంగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రితీష్ రెడ్డి ఆదేశాల మేరకు అక్కివారిపల్లి చెరువుతూములకు మరమ్మతులు చేయడం, సగిలేరు కెనాల్ నీటిని విడుదలచేయడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. 5 సంవత్సరాలనుండి చెరువు నీరు లేక పోయినా గతంలో అధికారులు స్పందించక పోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చెరువు నిండటంతో ఆయకట్టు రైతులు వ్యవసానికి సన్నద్ధమవుతున్నారని కలసపాడు ఆయకట్టు టీ.సి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెలుగుగంగ ఈ ఈ మల్లికార్జున , ఏయ్ సృజన, లష్కర్ నాగన్న, గుడిమె వెంగయ్య పర్యవేక్షించారు.